

విజయలక్ష్మిగా కనకమహాలక్ష్మి దర్శనం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారు ఆదివారం విజయలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి గులాబీ పువ్వులతో ప్రత్యేక పూజలు, సహస్రనామార్చన చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. సోమవారం అమ్మవారు విద్యాలక్ష్మిగా దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారికి ఐదు రకాల పుష్పాలతో పంచపుష్పార్చన జరుపుతారు.

-ఆంధ్రజ్యోతి/మహారాణిపేట

రైళ్లు, బస్సులు ఫుల్!



రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

జనసంద్రం.. రైల్వే స్టేషన్

- ఊపందుకున్న దసరా ప్రయాణాలు
- డైలీ, వీక్లీ, బై వీక్లీ రైళ్లు సైతం రద్దీ
- గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు మాత్రం అందుబాటులో బెర్తులు

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):

దసరా ప్రయాణాలు ఊపందుకున్నాయి. రైళ్లన్నీ రద్దీగా మారాయి. విజయదశమికి మరో మూడు రోజులు మాత్రమే గడువున్న నేపథ్యంలో సొంత ఊర్లకు వెళ్లేవారితో విశాఖ రైల్వే స్టేషన్ ఆదివారం జనసంద్రంగా మారింది.

ప్లాట్‌ఫామ్‌లపై ప్రయాణికుల తాకిడి పెరగడంతో జాతర వాతావరణం నెలకొంది. ప్రధానంగా తుని, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ చుట్టుప్రక్కల ప్రాంతాలకు వెళ్లే వారితోపాటు ఇతర ప్రాంతాలైన భువనేశ్వర్, హౌరా, చెన్నై, బెంగళూరు చుట్టుప్రక్కల ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో విశాఖ నుంచి బయలుదేరే ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు విశాఖ మీదుగా వివిధ ప్రాంతాలకు నడిచే డైలీ, వీక్లీ, బై వీక్లీ రైళ్లు సైతం రద్దీగా కనిపించాయి.

కిటకిటలాడిన 'రత్నాచల్'

ఉదయం 6.20 గంటలకు విశాఖ నుంచి బయలుదేరే జన్మభూమి

... మిగతా 6వ పేజీలో



ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో పల్లెవెలుగు బస్సు వద్ద రద్దీ

ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసిన ప్రయాణికులు

- ఆదివారం ఒక్కరోజే ప్రయాణించినవారు 4.2 లక్షల మంది..
- 90 శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో
- 65 ప్రత్యేక బస్సులు నడిపిన అధికారులు

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు దసరా ప్రయాణికుల తాకిడి మరింత అధికమైంది. తగినన్ని సర్వీసులు లేక ప్రయాణికులు కిక్కిరిసి మరీ బస్సుల్లో ప్రయాణించారు. వారిని నియంత్రించి గమ్య స్థానాలకు చేర్చేందుకు అధికారులు, సిబ్బంది నానాపాట్లు పడ్డారు. అవసరమైనన్ని

... మిగతా 6వ పేజీలో

జీఎస్టీ 2.0పై ఇంటింటా ప్రచారం

- సంస్కరణల ఫలితాలను ప్రజలకు తెలియజేసే బాధ్యత ఆరోగ్యశాఖకు
- నాలుగు వారాల పాటు అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- ఆరోగ్యశాఖ అధికారుల నుంచి ఏఎన్ఎం వరకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిందే
- ఫొటోలను గ్రూపుల్లో షేర్ చేయాలని సూచించిన డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



డాక్టర్ జగదీశ్వరరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలు, నూతన మార్పులను ప్రజలకు తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించే బాధ్యతను వివిధ ప్రభుత్వ శాఖలకు అప్పగించాయి. ఈ క్రమంలో జిల్లాలో జీఎస్టీ 2.0 సంస్కరణలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ సన్నద్ధమైంది. ఆదివారం

... మిగతా 6వ పేజీలో

స్థలాల క్రమబద్ధీకరణలో చేతివాటం

- రెవెన్యూ అధికారుల పేరు చెప్పి కూటమి నేత రూ.లక్షల్లో వసూలు
- సదరు దరఖాస్తులో చిన్న సమస్య ఉండడంతో పక్కన పెట్టిన అధికారులు
- స్థల యజమాని రెవెన్యూ సిబ్బందిని సంప్రదించడంతో వెలుగుచూసిన కూటమి నేత దందా
- షాక్‌కు గురైన రెవెన్యూ అధికారులు

విశాఖపట్నం/గాజువాక, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):

గాజువాక పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల క్రమబద్ధీకరణ పేరుతో వైసీపీ నుంచి కూటమిలో చేరిన నేత ఒకరు భారీగా చేతివాటం చూపడం వెలుగులోకి వచ్చింది. అదికూడా రెవెన్యూ విభాగంలోని అధికారుల పేరు చెప్పి మరీ రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడడం కలకలం రేపుతోంది. గాజువాకలో ఆక్రమణల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి జీవో నంబర్-45ను విడుదల చేసింది. ఇంటి పన్ను రశీదు, విద్యుత్ బిల్లు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆక్రమణలను క్రమబద్ధీకరించాలని జీవోలో పేర్కొంది. ఈ మేరకు పలువురు ఆక్రమణదారులు తమ స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు



దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది డిసెంబరులోగా క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఆయా మండల తహశీల్దార్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో కొందరు బ్రోకర్లు రంగంలోకి దిగి తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి స్థలాల క్రమబద్ధీకరణకు ప్రయత్నాలు

... మిగతా 6వ పేజీలో

నిధులు కుమ్మరింత!

సీఐఐ సదస్సు పేరుతో రూ.40 కోట్లతో నగర సుందరీకరణ పనులకు జీవీఎంసీ ప్రతిపాదనలు

- నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం
- అజెండా కాపీలను సకాలంలో పంపకపోవడంపై మేయర్, అధికారుల తీరుపై పలువురు కమిటీ సభ్యుల అసంతృప్తి



విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):

నగరంలో జరగబోయే పారిశ్రామిక పెట్టుబడుల సదస్సు (సీఐఐ) పేరుతో నిధుల కుమ్మరింతకు జీవీఎంసీ అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ ఏడాది నవంబరు 14, 15 తేదీల్లో నగరం వేదికగా సీఐఐ సదస్సు జరగనున్న విషయం తెలిసిందే. దీంతో నగరంలోని రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, మరమ్మతులు, సెంటర్ మీడియన్లు, డివైడర్లకు రంగులు వేయడం, పచ్చదనం అభివృద్ధి, రహదారులపై మార్కింగ్‌లు, స్టడ్స్ ఏర్పాటు, ప్రధాన రోడ్లపై కొత్తగా బీటీ లేయర్ల నిర్మాణం, వీధి దీపాలకు మరమ్మతులు, కొత్తగా హైమాస్ట్ ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, డి వైడర్లు, ఫుట్‌పాత్‌లపై కెర్బ్ వాల్స్ పెయింటింగ్, జాతీయ రహదారిపై ఎన్ఏడీ జంక్షన్ నుంచి ఆర్అండ్‌బీ కూడలి వరకు ఉన్న ఐరన్ తీగల ఫెన్సింగ్ పాడైపోవడంతో కొత్తగా ఏర్పాటు చేయడం వంటి పనుల కోసం సుమారు రూ.40 కోట్ల వరకు వెచ్చించేందుకు ప్రతిపాదనలను తయారుచేశారు.

సీఐఐ సదస్సు బీచ్ రోడ్డులోని ఏవీఐఐసీ మైదానంలో నిర్వహించాలని అధికారులు భావిస్తుండగా, ఎయిర్‌పోర్టు నుంచి ఎన్ఏడీ జంక్షన్ మీదుగా తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లైఓవర్, సిరిపురం జంక్షన్, ఆలిండియా రేడియో డౌన్ మీదుగా రోడ్లు, ఫుట్‌పాత్‌లు, గ్రీన్ బెల్ట్ రిపేర్లు, సుందరీకరణ, గ్రీనరీ డెవలప్‌మెంట్, లైటింగ్ రిపేర్లకు పనులు ప్రతిపాదించిన అధికారులు... ఎన్ఏడీ జంక్షన్ నుంచి సింహాచలం, అడవివరం, హనుమంతవాక మీదుగా విశాలక్షినగర్ వైపు రోడ్లకు మరమ్మతులు, మార్జిన్ పెయింటింగ్‌లు, స్టడ్స్ ఏర్పాటు, ఫుట్‌పాత్‌ల రిపేర్లు, పెయింటింగ్‌లు, గ్రిల్స్‌కు రంగులు వేయాలని ప్రతిపాదించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అలాగే హనుమంతవాక జంక్షన్ నుంచి వెంకోజీపాలెం పెట్రోల్ బంక్, ఎంవీపీలోని కరాచీ బేకరీ మీదుగా సమతా కాలేజీ రోడ్డును కొత్తగా బీటీ వేయడంతోపాటు రిపేర్లు, రోడ్డు మార్కింగ్, స్టడ్స్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. కరాచీ బేకరీ జంక్షన్ నుంచి ఎంవీపీ డబుల్ రోడ్డు, రైతు బజార్ సర్కిల్ మీదుగా అప్పూఘర్ వరకు కొత్త రోడ్లు, పెయింటింగ్‌లు, ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు, రంగులు వేయాలని ప్రతిపాదించారు. అదే విధంగా కోస్టల్ బ్యాటరీ నుంచి సీతకొండ వరకు బీచ్ రోడ్డులో సుందరీకరణ, రోడ్డు మార్జిన్ పెయింటింగ్‌లు, ఫుట్‌పాత్‌లు, గ్రిల్స్ పెయింటింగ్ పనులను ప్రతిపాదించారు. నగరంలోని వీఐపీ రోడ్డు, సిరిపురం జంక్షన్, బీచ్ రోడ్డు, పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ ఆలయం మీదుగా కురుపాం సర్కిల్ వరకు రోడ్డు అద్భుతంగా ఉన్నప్పటికీ అధికారులు మాత్రం రిపేర్లు, పెయింటింగ్‌లు, కొత్త బీటీ లేయర్ల పేరుతో ప్రతిపాదనలు రూపొందించడం విస్మయానికి గురిచేస్తోంది. సీఐఐ సదస్సు పేరుతో అవసరం లేని పనులకు కూడా ప్రతిపాదనలు తయారుచేసి, కాంట్రాక్టర్లతో తూతూమంత్రంగా పనులు చేయించి అధికారులు నిధులను దుర్వినియోగం చేసే అవకాశం ఉందని కొందరు కార్పొరేటర్లు విమర్శలు గుప్పిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్నట్టు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, నిర్ణయం తీసుకునేందుకు 91 అంశాలతో అజెండాను తయారుచేసి సభ్యులకు ఆదివారం అందజేశారు. అజెండాలో ప్రధానంగా నగరంలో నవంబరు 14, 15 తేదీల్లో జరిగే సీఐఐ సదస్సు కోసం నగర సుందరీకరణ, అభివృద్ధికి సంబంధించిన

... మిగతా 6వ పేజీలో

ఇకపై గ్రీన్ పడితే రైట్.. రైట్..!



వడివడిగా నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్

- నాలుగు సంస్థలతో ట్రయల్ రన్ పూర్తి
- అక్టోబరులో టెండర్లు పిలవనున్న జీవీఎంసీ
- నవంబరు నుంచి ప్రాజెక్టు అమలులోకి వచ్చే అవకాశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ట్రాఫిక్ కష్టాల నుంచి వాహనచోదకులకు త్వరలో విముక్తి లభించనున్నది. ఒకచోట ట్రాఫిక్ సిగ్నల్ గ్రీన్ పడితే తరువాత వేరే జంక్షన్‌కు వెళ్లేసరికి కూడా గ్రీన్ సిగ్నల్ పడేలా సిగ్నల్స్ సింక్రనైజేషన్ ప్రక్రియకు అధికారులు శరవేగంగా అడుగులు వేస్తున్నారు. ఇటీవలే నాలుగు సంస్థలతో నగరంలో నాలుగు చోట్ల నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతం కావడంతో జీవీఎంసీ అధికారులు ఆసక్తి వ్యక్తీకరణ (ఆర్ఎఫ్‌పీ), తరువాత టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. నవంబరు నాటికి నగరంలో కొత్త సిగ్నల్ విధానం అందుబాటులోకి వస్తుందని జీవీఎంసీ, పోలీస్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ విషయమై ఇటీవల కలెక్టర్, సీపీ, నాలుగు సంస్థల ప్రతినిధులతో సమావేశమైన ఎంపీ శ్రీభరత్ (ఫైల్ ఫొటో)

నగరంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. జాతీయ రహదారిపై ఎయిర్‌పోర్టు నుంచి ఆనందపురం జంక్షన్‌కు చేరుకోవాలంటే కనీసం గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతుంది. అదే ఉదయం, సాయంత్రం వంటి రద్దీ వేళల్లో అయితే మరో గంట సమయం అదనంగా పడుతుంది. ఒకచోట రెడ్ సిగ్నల్ పడితే రెండు నిమిషాలు వేచివున్నాక గ్రీన్ సిగ్నల్ పడింది కదా అని ముందుకు వెళితే అక్కడ రెడ్ సిగ్నల్ పడి ఉంటుంది. దీంతో అక్కడ మరోసారి నిరీక్షించాల్సి ఉంటుంది. కొమ్మాది, కార్ షెడ్, హనుమంతవాక, ఇసుకతోట వంటి కూడళ్ల వద్ద అయితే రెండుసార్లు సిగ్నల్ పడితే గానీ జంక్షన్ దాటలేని పరిస్థితి ఉంటుంది. దీనివల్ల నగరంలో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడడం, వేగంగా వెళ్లిపోవాలనే ఆత్రుతలో వాహనచోదకులు ప్రమాదాలకు గురికావడం జరుగుతోంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ చేయాలని ఎప్పటినుంచో ప్రతిపాదన ఉన్నప్పటికీ అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడం, ప్రజాప్రతినిధుల నుంచి సహకారం లోపించడం వంటి కారణాలతో ఇది ప్రతిపాదనలకే పరిమితమైపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. తరచూ జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలు నిర్వహించడం, దేశ ప్రధాని, రాష్ట్రపతి వంటి ప్రముఖుల పర్యటనలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా తయారైంది. దీనిని అధిగమించేందుకు నగరంలోని

... మిగతా 6వ పేజీలో

పర్యాటక ప్రాంతాలు కిటకిట





రోప్‌వే ద్వారా కైలాసగిరికి వెళ్లేందుకు టికెట్ల కోసం బారులుతీరిన సందర్శకులు

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. దసరా సెలవులు కావడంతో నగర పరిధిలోని అనేక ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో నగరంలోని కైలాసగిరి, ఆర్కే బీచ్, జూ పార్కు, తెన్నేటి పార్కు, వీఎంఆర్‌డీఏ పార్కు సందర్శకులతో కిక్కిరిసిపోయాయి. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఆర్కే బీచ్‌లో పలువురు సముద్ర స్నానాలు చేస్తూ, అలలతో ఆటలాడుతూ ఆనందంగా గడిపారు.

చినముషిడివాడలో చెరువు కబ్జా

- తప్పుడు పత్రాలతో తెగబడుతున్న ఆక్రమణదారులు
- రెవెన్యూ సిబ్బంది సహకారంతోనే నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు

పెందుర్తి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):

నగర శివారు పెందుర్తిలో భూముల విలువ గణనీయంగా పెరగడంతో చెరువులను కబ్జాదారులు ఆక్రమిస్తున్నారు. చెరువు స్థలమా..అయితే మాకేంటి? అంటూ అక్రమార్కులు ఆక్రమణలకు తెగబడుతున్నారు. ఆక్రమిత స్థలాల్లో తప్పుడు పత్రాలతో యథేచ్ఛగా పక్కా నిర్మాణాలు చేపడుతూ రెవెన్యూ శాఖకు సవాల్ విసురుతున్నారు. పెందుర్తి రెవెన్యూ మండలం చినముషిడివాడ సర్వే నంబరు 70లో సుమారు 18 ఎకరాల చెరువు ఉంది. చినముషిడివాడ ప్రధాన రహదారి సమీపంలోని చాణక్యనగర్ శివారు కిశోర్ లేఅవుట్ మీదుగా ఎఫ్‌సీఐ గోదాం వరకు ఈ చెరువు విస్తరించి ఉంది. కాలక్రమంలో చెరువు సమీప భూములు లేఅవుట్ మీదుగా మారడంతో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. స్థలాల విలువ రూ.కోట్లకు ఎగబాకింది. ఈ క్రమంలో వ్యవసాయ భూములకు ఆనుకుని ఉన్న ఈ చెరువుపై ఆక్రమణదారుల కన్నుపడింది. చెరువు పరిసర ప్రాంతంలో లేఅవుట్లు ఉండటంతో గజం స్థలం విలువ సుమారు రూ.40 వేలుగా ఉంది. దీంతో కొందరు సిండికేట్ అయ్యి ఈ చెరువు స్థలాలను కబ్జా చేసేందుకు పక్కా స్కెచ్ వేశారు. చెరువును ఆనుకుని ఉన్న జిరాయితీ సర్వే నంబర్ వేసి తప్పుడు పత్రాలు సృష్టించి కొంతకాలంగా ఆక్రమణలకు తెర తీశారు. ఇలా ఆక్రమించిన స్థలాల్లో పక్కా



చెరువు స్థలంలో చేపట్టిన నిర్మాణం

... మిగతా 6వ పేజీలో

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి మధురవాడకు చెందిన ఎం. జగదీశ్వరరావు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం నగదు రూపంలో అన్నప్రసాద విభాగం పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావుకు ఆదివారం ఆయన అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

ఎన్‌ఎంఎంఎస్ శిక్షణకు పూర్తి సహకారం

తగరపువలస, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎంఎంఎస్ ఉచిత శిక్షణకు తన సంపూర్ణ సహకారం అందిస్తానని సామాజిక కార్యకర్త, జీవీఎంసీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఆయన్ను ఎఫ్ఈఎస్ సభ్యులు ఆదివారం సన్మానించారు.

నేడు ఆలయాల పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పద్మనాభం రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపల్లి, తునివలస గ్రామాల్లో జీర్ణావస్థకు చేరుకున్న రామాలయాల పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేయనున్నారు.ఈమేరకు టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వచ్చే నెల 10న 'బెజవాడ మార్చ్'

సింహాచలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 10న పది లక్షల మందితో బెజవాడ మార్చ్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ఐక్యవేదిక ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆదివారం సింహాచలంలో ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జేఏసీ ఛైర్మన్ జానీపాషా, కార్యదర్శి వి. నిఖిల్‌కృష్ణ, కన్వీనర్ అబ్దుల్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

సెంటినరీ మెగా క్రికెట్ కప్ పోటీల్లో ఎంట్రీలకు గడువు పెంపు

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏయూ శతాబ్ది వేడుకల్లో భాగంగా నిర్వహించనున్న మెగా క్రికెట్ కప్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీలను పంపించడానికి వచ్చే నెల 8వ తేదీ వరకు అవకాశం కల్పించినట్టు ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్. విజయ్ మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. కళా శాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎంట్రీలను సకాలంలో పంపించేలా చూడాలన్నారు. విన్నింగ్ జట్టుకు రూ. లక్ష, రన్నరప్ జట్టుకు 50 వేలు నగదు బహుమతి అందిస్తామన్నారు.

ఇకపై గ్రీన్ పడితే రైట్..రైట్

... 5వ పేజీ తరువాయి

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను సింక్రనైజేషన్ చేయడం ద్వారా ఒక పరిమిత వేగంతో ప్రయాణించే వాహనం ఒకచోట గ్రీన్ సిగ్నల్ దాటి వెళితే తరువాత జంక్షన్‌లో కూడా గ్రీన్ సిగ్నల్ పడివుండేలా సాంకేతిక పరిజ్ఞానంతో సిగ్నల్ వ్యవస్థను మార్చే ప్రతిపాదనపై సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టిసారించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో నిధుల సర్దుబాటు గురించి రెండు నెలల కిందట సీపీ ప్రస్తావించగా.. ఆయన సుముఖత వ్యక్తం చేశారు. దీనిని కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తోపాటు ఎంపీ శ్రీభరత్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీ శ్రీభరత్ వీలైనంత వేగంగా దీనిపై చర్యలు ప్రారంభించాలని సీపీ, జీవీఎంసీ కమిషనర్‌లకు సూచించడంతో గతనెలలో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ ప్రాజెక్టు నిర్వహణలో అనుభవం కలిగిన సంస్థలతో సంప్రతింపులు జరిపారు. హైదరాబాద్, బెంగళూరు, లక్నో, ఢిల్లీ, ఇండోర్ వంటి నగరాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ ప్రాజెక్టులు నిర్వహిస్తున్న బృహస్పతి, అవిరోస్, అర్కడిస్, నయన్ సంస్థలు నగరంలో పైలట్ ప్రాజెక్టు కింద కొన్ని ప్రాంతాల్లో సర్వే చేపట్టాయి. నాలుగు సిగ్నల్ పాయింట్ల వద్ద ట్రయల్ రన్ నిర్వహించగా విజయవంతమైంది. ఇందుకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇటీవల ఎంపీ శ్రీభరత్ సమక్షంలో కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్‌లకు ఆయా సంస్థలు వివరించాయి. ఎంపీ శ్రీభరత్ సంతృప్తి వ్యక్తం చేయడంతో తక్షణమే ఈ ప్రాజెక్టు నిర్వహణకు ఆర్ఎఫ్‌పీ పిలిచి, అక్టోబరు చివరి నాటికి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు దీనికి అనుగుణంగా చర్యలను వేగవంతం చేశారు. అంతా అనుకున్నట్టు జరిగితే నవంబరు నాటికి నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పోలీస్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

స్థలాల క్రమబద్ధీకరణలో చేతివాటం

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నారు. దీంతో సర్వే నంబర్-86, 87ల్లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడిన ముఠాలు పోటాపోటీగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేస్తున్నారు. ప్రసాదరావు లేఅవుట్‌లో కొన్ని ప్లాట్లకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో ముంబైలో ఉన్న ఒకరు తన స్థలం క్రమబద్ధీకరణ కోసం గాజువాకలోని కూటమి నేతను సంప్రదించారు. క్రమబద్ధీకరణ చేయాల్సిన స్థల విస్తీర్ణం పెద్దది కావడంతో రెవెన్యూ అధికారులకు లంచాల కోసం కనీసం రూ.30 లక్షలు ఖర్చవుతుందని సదరు నేత చెప్పడంతో ముంబైలో ఉన్న వ్యక్తి అందుకు అంగీకరించి సొమ్ము చెల్లించారు. అయితే ఈ స్థలం క్రమబద్ధీకరణలో చిన్న సమస్య ఉండడంతో రెవెన్యూ అధికారులు ఆ దరఖాస్తును పక్కన పెట్టేశారు. దీంతో ముంబైకు చెందిన వ్యక్తి తనకు తెలిసిన వారి ద్వారా రెవెన్యూ ఉద్యోగులను కలిసి తాను చెల్లించిన సొమ్ము విషయం వెల్లడించారు. దీంతో ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా రెవెన్యూ అధికారులకు చేరడంతో వారు షాక్‌కు గురై ఈ విషయంపై ఆరా తీశారు. కాగా కూటమిలో ఉన్న అన్ని పార్టీల నేతలు, విపక్షాలకు చెందిన నాయకులు కూడా కొన్ని ఆక్రమణలకు పాల్పడి వాటిపై తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇదే ప్రాంతంలో కొందరు ఆక్రమణదారులపై కొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఒకే కుటుంబంలో పలువురి పేరుతో ప్లాట్లు ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో గాజువాక రెవెన్యూ అధికారులు క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించే పనిలో ఉన్నట్టు తెలిసింది.

త్వరితగతిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చిత్రంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ కూడా ఉన్నారు

సింహాచలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భోగాపురం విమానాశ్రయం సిద్ధమయ్యే నాటికి మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. రూ.174 కోట్లతో 26 కిలోమీటర్ల మేర వీఎంఆర్‌డీఏ చేపడుతున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి ఆదివారం ఆయన 98వ వార్డు పాత అడివివరం కూడలిలో శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖలో ఏర్పాటు కానున్న ఐటీ కంపెనీలు, పర్యాటక ప్రాజెక్టులు, పరిశ్రమలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ల విస్తరణ, నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. చిప్పాడ మాస్టర్ ప్లాన్ రహదారిని ఎక్కువగా వినియోగించే దివీస్ ఫార్మా రూ. 30 కోట్లు, గంభీరం రోడ్డు నిర్మాణానికి లాన్సమ్ కంపెనీ కొంత వ్యయం అందజేస్తున్నాయని చెప్పారు. అనుసంధాన మార్గాల నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ నియంత్రణ చాలా వరకు పరిష్కారమవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది పాలనలో రూ. 12 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడం ఒక చరిత్ర అని అభివర్ణించారు. ఐటీ శాఖ మంత్రి లోకేశ్ చొరవతో విశాఖ రూపురేఖలు మారిపోతున్నాయని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, సత్వా, కాంగిజెంట్, అదానీ డేటా సెంటర్ వంటి ప్రతిష్ఠాత్మక కంపెనీలు రావడంతో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ల రోడ్లకు రూ. 320 కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. మొదటి దశలో భీమిలి నియోజకవర్గం పరిధిలోని ఏడు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ 2026 జూన్ నాటికి భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రానున్న తరుణంలో అనుసంధాన రోడ్ల నిర్మాణాన్ని ఏప్రిల్‌లోగా పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రుణ గ్రహీతలకు బీమా సదుపాయం



మహాజన సభలో మాట్లాడుతున్న అధ్యక్షులు కర్రి అప్పలస్వామి

సింహాచలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అడివివరం సహకార పరపతి సంఘంలో రుణాలు తీసుకున్న వారికి బీమా సదుపాయం కల్పించనున్నట్టు పాలకమండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. వచ్చే సంక్రాంతి నుంచి దీన్ని అమలు చేస్తామని చెప్పారు. ఆదివారం అడివివరం పరపతి సంఘం కార్యాలయం ఆవరణలో మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు తీసుకున్న రుణాలకు కూడా బీమా వర్తిస్తుందన్నారు. దీర్ఘకాలిక రుణాల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్టు చెప్పారు. అలాగే సంఘంలో కుదువ పెట్టిన బంగారు ఆభరణాలకు సకాలంలో వడ్డీలు చెల్లించని వాటిని కూడా బహిరంగ వేలం వేయనున్నట్టు తెలిపారు. స్వల్ప, దీర్ఘ, మధ్యకాలిక రుణాలు తీసుకున్న వారు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం సంఘ కార్యదర్శి ఎం. శివ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.7.7 కోట్ల అంచనా బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టారు. అంతకముందు పాలక మండలి సభ్యుడు లండ వెంకటరమణ, ఇతర సభ్యుల మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు బంటుబల్లి మహేశ్, సభ్యులు కొలుసు గురునాథరావు, బోర ప్రసాద్‌రెడ్డి, కోరాడ ఈశ్వరరావు, ఆకుల నాగరాజు, పాలూరి సూరిబాబు, మజ్జి ధర్మరాజు, గునిశెట్టి శ్రీనివాసరావు, రాజకుమారి, గోపీకిశోర్, గేదెల మురళీ, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి, రుషికొండ బీచ్‌లు కిటకిట


సందర్శకులతో సందడిగా కనిపిస్తున్న రుషికొండ బీచ్

సాగర్‌నగర్/భీమునిపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. దసరా సెలవులు కావడంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సముద్ర స్నానాలు చేస్తూ.. ఇసుక తిన్నెల్లో ఆటలు ఆడుతూ ఆనందంగా గడిపారు. కొందరు బోటు షికార్ చేసి, కెరటాలపై తేలియాడారు. కాగా సందర్శకుల తాకిడి ఎక్కువ కావడంతో బీచ్‌లో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తాయి.బీచ్ రోడ్డులో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది. భీమిలి బీచ్ కూడా సందర్శకులతో సందడిగా కనిపించింది. సాధారణంగా దసరా ఉత్సవాల సమయంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల నుంచి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కానీ ఈసారి వర్షాల ప్రభావం వల్ల రద్దీ తగ్గింది.

రైళ్లు, బస్సులు ఫుల్..

... 5వ పేజీ తరువాయి

ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను (12805) మొదలుకుని రాత్రి 11.20 గంటలకు వెళ్లే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ వరకు ప్రయాణికుల తాకిడి నెలకొంది. ప్రధానంగా మధ్యాహ్నం విజయవాడకు బయలుదేరే రత్నాచల్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ (12717) ప్రయణికులతో కిక్కిరిసిపోయింది. విజయవాడ నుంచి విశాఖకు చేరిన ప్రయాణికుల సంఖ్య కూడా తోడవ్వడంతో స్టేషన్‌లోని 8వ నంబర్ ప్లాట్‌ఫామ్ రద్దీగా మారింది. రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు చేరాల్సిన కొందరు ప్రయాణికులు తిరుమల ఎక్స్‌ప్రెస్ (18521), విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727) వంటి రైళ్ల జనరల్ కోచ్‌లను ఆశ్రయించడంతో అవి కిక్కిరిసి నడిచాయి. దసరా రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది చేపట్టిన చర్యల కారణంగా రైళ్ల ప్రవేశ ద్వారం వద్ద ఎక్కే, దిగే ప్రయాణికులు నియంత్రణ పాటించడంతో ఎటువంటి దుర్ఘటనలు చోటుచేసుకోలేదు.

చెన్నై, బెంగళూరు, హౌరా రైళ్లు రద్దీ

విశాఖ మీదుగా హౌరా, బెంగళూరు, చెన్నై వెళ్లే రైళ్లకు ఆదివారం నుంచి మరింత రద్దీ పెరిగింది. దసరాకు సొంత ఊర్లకు చేరేవారితో రైళ్లన్నీ రద్దీగా నడిచాయి. దీంతో చెన్నై, హౌరా మధ్య రాకపోకలు సాగించే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12842), మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840), చెన్నై-సంత్రాగచ్చి (22808), చెన్నై-షాలిమార్ (22826) వంటి రైళ్లతో పాటు ఇతర ప్రాంతాల నుంచి హౌరా, చెన్నై చేరే రైళ్లు కిక్కిరిశాయి. అలాగే హౌరా, బెంగళూరు మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), హౌరా-యశ్వంత్‌పూర్ (12863), భువనేశ్వర్-బెంగళూరు వంటి పలు రైళ్లు రద్దీగా నడిచాయి. ఇదిలా ఉండగా విశాఖ మీదుగా హౌరా, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు నడిచే రైళ్లకు అక్టోబరు నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయిన పరిస్థితి ఏర్పడింది.

'గరీబ్‌రథ్'కు అందుబాటులో బెర్తులు

విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు (12739) సోమవారం నుంచి బెర్తులు లభిస్తున్నాయి. అలాగే గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు (12727) కూడా ఏసీ క్లాసు బెర్తులు అందుబాటులో ఉండడం విశేషం. ఈ రెండు రైళ్లకు నవంబరులో కూడా బెర్తులు లభిస్తున్న నేపథ్యంలో దసరా తిరుగు ప్రయాణికులకు ఊరట లభించనున్నది. అలాగే విశాఖలో ఉదయం 5.45 గంటలకు బయలుదేరే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833), మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరే వందేభారత్ (20708) రైళ్లకు దసరా ముందు రోజు కూడా సీట్లు అందుబాటులో ఉన్నాయి. విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు (12805) అక్టోబరు ఆరు వరకు ఏసీ చైర్‌కార్ సీట్లు నిండిపోయాయి. ప్రతి బుధ, శనివారం నడిచే విశాఖ-నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20811)... ప్రతి ఆది, మంగళ, గురువారం నడిచే దురంతో ఎక్స్‌ప్రెస్ (22203)లకు కొన్ని తేదీల్లో బెర్తులు/ఆర్ఏసీ అందుబాటులో ఉన్నాయి. ఇక విశాఖ మీదుగా నడిచే విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015),హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12703), కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) వంటి దూర ప్రాంత రైళ్లకు అక్టోబరు పదో తేదీ వరకు డిమాండ్ నెలకొంది.

ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసిన ప్రయాణికులు

... 5వ పేజీ తరువాయి

ప్రత్యేక బస్సులను సమకూర్చేందుకు డిపో మేనేజర్లు అష్టకష్టాలు పడ్డారు. దసరాకు మూడు రోజులే ఉండడం.. వారాంతపు సెలవు కావంతో ఎక్కువ మంది ఆదివారం ప్రయాణాలు పెట్టుకున్నారు. దీంతో ప్రయాణికుల తాకిడి పెరిగిపోయింది. విద్య, ఉద్యోగం, వ్యాపార రీత్యా హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, తిరుపతి, భీమవరం వంటి ప్రాంతాల్లో ఉంటున్న ఉత్తరాంధ్ర వాసులు ఆయా ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర రవాణా సాధనాలను వినియోగించుకుని విశాఖ వచ్చేశారు. వారంతా బస్సుల్లోనే స్వస్థలాలకు వెళ్లడంతో అన్ని కాంప్లెక్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ప్లాట్‌ఫారాలపై నిలిచిన బస్సుల కెపాసిటీకి మూడు నాలుగు రెట్లు ప్రయాణికులు వేచివున్నారు. ఉన్న బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఆర్డినరీ, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం సాగించేందుకు అధిక సంఖ్యలో మహిళలు వాటి కోసం నిరీక్షించారు. రీజియన్‌లోని స్టీల్ సిటీ, గాజువాక, వాల్తేరు డిపోలకు సంబంధించిన స్త్రీశక్తి బస్సులన్నింటినీ ప్రత్యేక సర్వీసులుగా వివిధ రూట్లలో నడిపినప్పటికీ ప్రయాణికుల రద్దీ అలాగే కొనసాగింది.

ఒక్కరోజే 4.2 లక్షల మంది ప్రయాణం

దసరా దృష్ట్యా ఆదివారం ఒక్కరోజే 4.2 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించినట్టు అధికారులు లెక్కలు కట్టారు. ఇందులో 75 శాతానికి పైగా మహిళలు ఉన్నట్టు టిమ్స్ నుంచి జారీ అయిన జీరో టిక్కెట్ల ఆధారంగా లెక్కలు తేల్చారు. విశాఖ రీజియన్‌లోని 780 బస్సుల్లో స్త్రీశక్తి అమలుకు ముందు ప్రతిరోజూ 3.1 లక్షల మంది ప్రయాణించేవారు. స్త్రీశక్తి పథకం అమలు తరువాత ఈ సంఖ్య 4.1 లక్షలకు పెరిగింది. దసరా కారణంగా ఆదివారం నాటికి ఈ సంఖ్య 4.2 లక్షలకు చేరింది.

65 ప్రత్యేక సర్వీసులు

పెరిగిన ప్రయాణికులను నియంత్రించేందుకు ఆర్టీసీ అధికారులు ఆదివారం 65 ప్రత్యేక బస్సులను ఆపరేట్ చేశారు. వీటిని కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, మందస, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం రాజాం ప్రాంతాలకు నడిపారు. సిటీ సర్వీసుల్లో 65 బస్సులను ప్రత్యేక సర్వీసులుగా నడపడంతో సిటీ సర్వీసులకు కొరత ఏర్పడింది.

90 శాతానికి పైగా ఓఆర్

దసరా ప్రయాణికుల రవాణా కారణంగా ఆదివారం 90 శాతానికి పైగా సగటు ఆక్యుపెన్సీ రేషియో నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఈ ఏడాదిలో ఇది అత్యధిక ఆక్యుపెన్సీ రేషియోగా వారు అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల డిమాండ్ ఉంటే రాత్రి కూడా ప్రత్యేక బస్సులను నడుపుతామని ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు.

నిధులు కుమ్మరింత!

... 5వ పేజీ తరువాయి

పనులే ఎక్కువగా ఉన్నాయి. ఇవికాకుండా 67, 93, 96 వార్డుల పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు, నగరం లో పారిశుధ్య నిర్వహణ పనులు చేస్తున్న తాత్కాలిక కార్మికులకు జీతాల చెల్లింపులు, గాజువాక జోన్‌లోని వివిధ వార్డులో పేరుకుపోయిన చెత్తను అక్కడి డంపింగ్ యార్డుకు తరలించేందుకు వీలుగా అద్దె వాహనాలు, డ్రైవర్లను సమకూర్చుకోవడం, ముడసర్లోవలోని ఎం ఎస్ఎఫ్-3లో అద్దెప్రాతిదికన సమకూర్చుకున్న వాహనాలకు ముగ్గురు డ్రైవర్లను ఆరు నెలలకు నియమించుకోవడం వంటి అంశాలు ఉన్నాయి. స్టాండింగ్ కమిటీ సమావే శం ఏర్పాటు చేస్తున్నట్టు సభ్యులకు జీవీఎంసీ కార్యదర్శి కార్యాలయం నుంచి శనివారం రాత్రి సమాచారం అందడం, ఆదివారం సాయంత్రానికి అజెండా కాపీలను పంపించడం వివాదానికి దారితీసింది. స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు కనీసం మాటమాత్రంగానైనా తమకు చెప్పకపోవడం, ఆదివారం ఉదయానికి కూడా తమకు అజెండా కాపీలు అందకపోవడంతో పలువురు కమిటీ సభ్యులు ఆదివారం ఉదయం జీవీఎంసీ కార్యాలయంలోని ఫ్లోర్ లీడర్ చాంబర్‌లో సమావేశయ్యారు. ఈ సందర్భంగా మేయర్‌తోపాటు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. సోమవారం జరిగే సమావేశంలో అజెండాలోని అంశాలను క్షుణ్ణంగా చదివిన తరువాత, సంబంధిత అధికారుల వివరణ సంతృప్తిగా అనిపిస్తేనే ఆయా అంశాలను ఆమోదించాలని, లేని పక్షంలో వాయిదా కోరాలని తీర్మానించినట్టు సమాచారం.

నేడు ఆయుధ పూజ

సింహాచలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సోమవారం ఆయుధ పూజ చేయడానికి వైదికులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏడాది పొడవునా జరిగే వేడుకల్లో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామికి అలంకరించే కత్తి, బాకు, గద, శరం, విల్లు, తదితర ఆయుధాలను ఆదివారం బాండాగారం నుంచి బయటకు తీసి శుభ్రపరిచారు. మూలా నక్షత్రం పురస్కరించుకుని వాటికి పూజలు చేయనున్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యం

మధురవాడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన శాస్త్రీ య నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన మీనాక్షి కూచిపూడి అకాడమీ కళాకారులు పలు గీతాలకు నృత్యం ప్రదర్శించారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ముగిసిన జాతీయ స్థాయి చౌక్ బాల్ పోటీలు

ఆనందపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలవలస సమీపంలో ఉన్న అస్సెంట్ స్కూల్ వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి చౌక్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. 22 రాష్ట్రాల నుంచి 32 జట్లు పోటీల్లో పాల్గొనగా బాలుర విభాగంలో ఢిల్లీ జట్టు విన్నర్‌గా, మహారాష్ట్ర రన్నర్‌గా నిలిచాయి. తృతీయ స్థానంలో అసోం జట్టు గెలుపొందింది. బాలికల విభాగంలో పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, అసోం మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కోరాడ రాజబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ కొలగాన్ని శంకర్రావు, డైరెక్టర్ బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జీకేడీ ప్రసాద్‌కు జాషువా పురస్కారం


మంత్రి దుర్గేశ్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న జీకేడీ, చిత్రంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జర్నలిజం విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ జీకేడీ ప్రసాదరావుకు గుర్రం జాషువా పురస్కారం లభించింది. ఆదివారం ఆయన ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. పురస్కారంతో పాటు రూ. 50 వేలు నగదు, ప్రశంసాపత్రం పొందారు. ప్రసాదరావు దళితుల సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై వివిధ పత్రికల్లో వందకుపైగా వ్యాసాలు రాశారు. అలాగే జాషువా సాహిత్యంపై 30కిపైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈమేరకు ఆయనకు పురస్కారం ప్రదానం చేశారు.

జీఎస్టీ 2.0పై ఇంటింటా ప్రచారం

... 5వ పేజీ తరువాయి

నుంచి ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ సంస్కరణలు, ప్రయోజనాలను తెలియజేయాలంటూ ఆరోగ్యశాఖకు ఆదేశాలు అందాయి. ఇందులో భాగంగానే జిల్లా అంతటా ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలంటూ జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నాలుగు వారాలపాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. నూతన సంస్కరణలకు ముందు జీఎస్టీ శ్లాబులు నాలుగు ఉన్నాయి. 5,12,18, 28 శాతం శ్లాబుల్లో పన్నులను వసూలు చేసేవారు. ఈ నెల 22 నుంచి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 పేరుతో సంస్కరణలు చేపట్టింది. నూతన సంస్కరణలతో 5,18 శాతం శ్లాబుల్లోనే పన్నులను వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు 5,12 శాతం శ్లాబుల్లో ఉన్న అనేక రకాల వస్తువులు, నిత్యావసర సరకులపై పూర్తిగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తొలగించింది. దీనివల్ల సాధారణ, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇదే విషయాన్ని ప్రజలకు తెలియజేసే కార్యక్రమాలకు తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి.

ఇంటింటికీ వెళ్లి ప్రచారం

జీఎస్టీ నూతన సంస్కరణలకు ముందు ఉన్న శ్లాబులు, నూతన విధానం తరువాత వచ్చిన శ్లాబులు, పూర్తిగా పన్నులు తొలగించిన వస్తువులపై ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆరోగ్యశాఖ సిబ్బంది స్వస్థ్ నశక్త్ పరివార్ అభియాన్ పేరుతో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆయా శిబిరాలకు వచ్చే మహిళలు, ఇతరులకు నూతన సంస్కరణల గురించి తెలియజేయాల్సి ఉంటుంది. అలాగే పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేసే వైద్యులు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశ వర్కర్లు, హెడ్ క్వార్టర్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు నూతన సంస్కరణల గురించి తెలియజేయాల్సి ఉంటుంది. ఆయా ఇళ్లకు వెళ్లి ప్రజలకు వివరిస్తున్న ఫొటోలను సంబంధిత గ్రూపులో షేర్ చేయాలని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు.

వీటిపై ప్రత్యేకంగా..

నూతన సంస్కరణల వల్ల ప్రధానంగా ఆరోగ్య రంగానికి చెందిన వస్తువులు, ఉత్పత్తులపై జీఎస్టీ భారం తగ్గిన తీరును ప్రజలకు పూర్తి స్థాయిలో సిబ్బంది వివరించాల్సి ఉంటుంది. 12 శాతం జీఎస్టీ నుంచి ఐదు శాతానికి, ఐదు శాతం నుంచి జీరోకు తగ్గించిన ఔషధాల గురించి తెలియజేస్తారు. అలాగే కంటిచూపును సరిచేసే వస్తువులపై జీఎస్టీ భారాన్ని 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించారు. దీనివల్ల విద్యార్థులు, వృద్ధులకు కలిగే మేలును వివరించనున్నారు. చిన్నారులు, నవజాత శిశువులకు సంబంధించిన ఉత్పత్తులైన నాప్కిన్లు, లైనర్లు, ఫీడింగ్ బాటిళ్లపై జీఎస్టీ గతంలో 12 శాతం ఉండగా, ప్రస్తుతం ఐదు శాతానికి తగ్గించారు. అదేవిధంగా థర్మామీటర్‌పై ఇప్పటివరకు 18 శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి, యూహెచ్‌టీ పాలపై ఐదు శాతం ఉన్న జీఎస్టీని సున్నాకు తగ్గించారు. వ్యక్తిగత ఆరోగ్య బీమాపై 18 శాతం ఉన్న జీఎస్టీని సున్నాకు తగ్గించడం వల్ల కలిగే లబ్ధిని ప్రజలకు తెలియజేయనున్నారు. అదే సమయంలో క్యాన్సర్‌కు కారణంగా ఉన్న తంబాకు, ఇతర ఉత్పత్తులపై జీఎస్టీని 28 శాతం నుంచి 40 శాతానికి ప్రభుత్వం పెంచింది. ఈ అలవాట్లు ఉన్న ప్రజలకు ఇకపై పెరగనున్న ఆర్థిక భారాన్ని వివరించి వాటికి దూరంగా ఉండేలా అవగాహన కల్పించనున్నారు. దీనిపై ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు నూతన సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను, లబ్ధిని తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఇంటింట ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.

చినముషిడివాడలో చెరువు కబ్జా

... 5వ పేజీ తరువాయి

నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే ఇవి కొందరి చేతులు మారి విక్రయాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఆక్రమించి విక్రయాలు జరపడం సర్వసాధారణమైంది. ఇక్కడ నిర్మాణాలను ఆక్రమణలుగా నిర్ధారించి కొట్టేసినా, కొంతకాలం ఆగి మళ్లీ కట్టేస్తున్నారని, రెవెన్యూ కింది స్థాయి సిబ్బంది సహకారంతోనే నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే సుమారు ఆరు ఎకరాల చెరువు స్థలం పరాధీనమైందని, ఇందులో నిర్మాణాలు చేపట్టారని రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు.

తాజాగా ఇదే తరహాలో ఇక్కడి స్థలాన్ని సుమారు రెండొందల గజాలు ఆక్రమించి నిర్మాణానికి సిద్ధపడటంతో ఈ ఆక్రమణపై తహశీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు రావడంతో చెరువు ఆక్రమణల సంగతి వెలుగులోకి వచ్చింది. చెరువు స్థలాన్ని ఆక్రమించి శ్లాబ్ వేసినా రెవెన్యూ అధికారుల్లో కదలిక లేదు. చెరువులను జీవీఎంసీకి బదలాయింపు జరిపామని, వీటి పరిరక్షణ బాధ్యత వారిదేనని రెవెన్యూ వారు అంటున్నారు. ఇక్కడ పట్టణ ప్రణాళిక అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా.. కాసుల కక్కుర్తితో టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు మేల్కొనకపోతే మిగిలివున్న రూ.కోట్ల విలువైన చెరువు స్థలం కూడా పరాధీనమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా చినముషిడివాడలోని చెరువును సర్వే చేయాలని రెవెన్యూ శాఖ యోచిస్తుండడం ఆక్రమణదారుల్లో గుబులు రేపుతోంది.

ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు

-ఇంటి వెంకట అప్పారావు, పెందుర్తి తహశీల్దార్

చినముషిడివాడ సర్వే నంబర్-70లో చెరువు స్థలం ఆక్రమణకు సంబంధించి సర్వే చేపడతాం. చెరువుల పరిరక్షణ బాధ్యతను జీవీఎంసీకి బదలాయించిన నేపథ్యంలో ఆక్రమణల విషయాన్ని వారికి లేఖ ద్వారా తెలియపరిచాం. అక్రమ నిర్మాణాలను తొలగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

రైతు బజార్‌లో అనధికార నిర్మాణం

- ఎలాంటి అనుమతులు లేకుండా టీ దుకాణం పేరుతో శాశ్వత నిర్మాణం
- నోరు మెదపని అధికారులు
- సరుకు రవాణాకు అడ్డుగా ఉందంటూ రైతుల ఆవేదన



రైతుబజార్ ఆవరణలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్డు

పెదవాల్తేరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెద వాల్తేరు రైబజార్‌లో ఆధికారుల అనుమతులు లేకుండానే స్టాల్‌ ర్పాటు చేసుకున్నారు. టీ షాపు పేరుతో పక్కగా కట్టాడాలు చేపట్టారు. దీని గురంచి రైతుబజార్‌లోని ఎస్టేట్ ఆధికారి, ఇతర అధికారులు పట్టించుకోలేదు. అయితే ఈ విషయాన్ని మార్కెటింగ్ డీడీ శ్రీనివాసరావును అడగ్గా.. వివరణ కోరగా రైతుబజార్‌లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు లేవని, ఏవైనా నిర్మాణాలు చేపడితే వెంటనే తొలగిస్తామని తెలిపారు. అయితే దుకాణం ఏర్పాటు చేస్తున్న టీ షాపు నిర్వాహకుడిగా అడగ్గా.. గ్రీవెన్స్ సెల్‌లో జేసీకి ఇచ్చిన దరఖాస్తును చూపిస్తూ ఇదే పర్మిషన్ అని చెబుతున్నాడు. ఈ టీ షాపు రైతుబజార్ ప్రధాన గేటుకు అనుకుని కట్టడాలు చేపట్టడంతో ఉదయం, సాయంత్రం రైతుబజార్‌కు వచ్చే సుమారుగా 110 మంది రైతులు తాము వ్యాన్లు, ఆటోలో సరుకులు, కూరగాయలు, టమాటాలు, ఉల్లిపాయలు, పండ్లు, కొబ్బరికాయలు వంటి సరుకులు దించేటప్పుడు అడ్డంగా ఉంటుందని వాపోతున్నారు. వినియోగదారులు తమ వాహనాలు రైతుబజార్‌లోకి తీసుకురాడానికి కూడా ఇబ్బందిగా ఉందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు.

ఈ విధంగా రైతుబజార్‌లో బినామీ షాపులు కూడా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఒకరి పేరు మీద షాపు కేటాయిస్తే, మరొకరికి అద్దెకిచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. రైతుబజార్‌లో ఇంత జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

నగరానికి నత్తలు



విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికా నత్తలు నగరంలో కనిపించడం కలకలం రేపుతోంది. ఇప్పటికే గ్రామాల్లో పంటపొలాలపై పడి నత్తలు నష్టానికి గురిచేస్తున్నాయి. నత్తలతో పంటలు పాడవ్వడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నగర శివారు సుజాత నగర్‌లోని పార్కు, పరిసరాల్లోని పలు ఇళ్ల వద్ద నత్తలు కనిపించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పార్కుల్లోని చెట్లు, పండ్ల జాతులకు చెందిన చెట్లు, పూలతోటలపై నత్తల ప్రభావం ఉంటుందని ఉద్యానవన అధికారి ఒకరు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆరిలోవ, సెప్టెబరు 28 (ఆంధ్రజ్యోతి) : హనుమంతువాక కూడలి వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదరుషికొండ ప్రాంతానికి చెందిన అబంటి చైతన్య (29) మృతి చెందాడు. చైతన్య అతడి స్నేహితుడు మధుతో కలిసి బైక్‌పై కైలాసపురంలో ఉంటున్న బంధువులు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చైతన్య ప్రాణాలు కోల్పోగా, మధు స్వల్ప గాయాలతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్‌ఐ శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఈవోఐలకు వ్యతిరేకంగా ప్లాంటు అడ్మిన్ భవనం వద్ద ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటులో ఈవోఐలను రద్దు చేయాలని, ప్లాంటు ప్రైవేటీకరణ ప్రక్రియ విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్లాంటు అడ్మిన్ భవనం వద్ద ధర్నా చేపట్టనున్నట్టు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ధర్నా చేపడతామన్నారు. ఉక్కు కార్మిక వర్గం, నిర్వాసితులు, వివిధ సంఘాల ప్రతినిధులు భారీగా హాజరై ఉక్కు యాజమాన్యానికి తమ నిరసన తెలపాలని పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

స్టీల్‌ప్లాంటు, పరిసర ప్రాంతాల్లో ధర్నాకు అనుమతులు లేవు

- స్టీల్‌ప్లాంటు సీఐ కేశవరావు ప్రకటన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి ధర్నాలు నిర్వహించేందుకు అనుమతులు లేవని స్టీల్‌ప్లాంటే సీఐ ఎ.కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్లాంటు ప్రధాన పరిపాలన భవనం ముందుధర్నాకు నాయకులు పిలుపునిచ్చిన క్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఇతర నాయకులకు అనుమతి లేదని చెప్పటం జరిగిందని సీఐ తెలిపారు. ఒకవేళ ధర్నా చేపట్టాల్సి వస్తే జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేసుకోవచ్చుని, కానీ స్టీల్‌ప్లాంటే పరిసరాల్లో చేయరాదని సూచించారు. అనుమతి లేని చోట ధర్నాలు చేస్తే చట్ట రీత్యా తగు చర్యలకు శిక్షార్హులవుతారని తెలిపారు.

సినిమా గైడ్

- **ఓజి** : మెలోడి, శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),
- **ఘాటీ** : గోకుల్, ముక్తాస్, (గాజువాక)
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 28, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 26, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

ఆదర్శప్రాయుడు గుర్రం జాషువా

- దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



జాషువాకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

బీచ్ రోడ్డు, సెప్టెంబర్ 28, (ఆంధ్రజ్యోతి) : గుర్రం జాషువా ఆశయాలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం గుర్రం జాషువా జయంతి సందర్భంగా బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నతనం నుంచి సమసమాజ నిర్మాణం కోసం పాటుపడుతూ జాషువా నవయుగ చక్రవర్తిగా పేరు గాంచారన్నారు. కవిత్వమే ఆయుధంగా మూఢాచారాలపై తిరుగుబాటు చేసిన ఆధునిక తెలుగు కవి శ్రీగుర్రం జాషువా 'వడగాల్పు నా జీవితం... వెన్నెల నా సాహిత్యం' అంటూ పేదరికం, వర్గ సంఘర్షణ ఆర్థిక అసమానతలపై పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంచి కవిగా పలు రచనలు చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మాసిపోగు బాబూరాజు, కె.రాంబాబు, కొండపల్లి శ్రీనివాస్, వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్. అప్పారావు, కళాపీఠం అధ్యక్షులు వెంకట్ శానాల తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎన్‌యూలో విజయవంతంగా 110 హోలెప్ శస్త్ర చికిత్సలు



వివరాలు వెల్లడిస్తున్న ఏఐఎన్‌యూ వైద్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రొస్టేట్ చికిత్సల్లో నగర పరిధి ద్వారకానగర్‌లోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) సరికొత్త ప్రమాణాలను సృష్టించినట్టు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ వివరాల ను వెల్లడించారు. ఇప్పటి వరకు ఆస్పత్రిలో 100 హోల్మియమ్ లేజర్ ఎన్‌క్లేషన్ ఆఫ్ ద ప్రొస్టేట్ (హోలెప్) శస్త్ర చికిత్సలను ఏఐఎన్ యూలో విజయవంతంగా నిర్వహించినట్టు ఏఐఎన్‌యూ ఎండీ, యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ జి.రవీంద్ర వర్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అమిత్ సాప్లే, డాక్టర్ పి.శ్రీధర్ వెల్లడించారు. ప్రొస్టేట్ సమస్యలకు, బినైన్ ప్రొస్టేట్ హైపర్ ప్లాసియా (బీపీహెచ్)కి అతి తక్కువ కోతతోనే అత్యాధునిక శస్త్ర చికిత్సలను చేస్తున్నామన్నారు. ఇది ఆస్పత్రి వైద్యులు నైపుణ్యానికి నిదర్శనంగా పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలు, శిక్షణ పొందిన సిబ్బంది, లేజర్ టెక్నాలజీ సాయంతో హోలెప్ చికిత్సలు చేస్తున్నట్టు తెలిపారు. హోలెప్ శస్త్ర చికిత్సలు నిర్వహణలో ఈ తరహా నైపుణ్యం కలిగిన ఆస్పత్రులు అతి తక్కువ ఉన్నాయని, వాటి సరసన ఇప్పుడు నగరంలోని ఏఐఎన్‌యూ నిలిచింద న్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరగడంతో చాలా మంది పురుషులకు మధుమేహం, అధిక రక్తపోటు, గుండెసమస్యలకు తోడు ప్రొస్టేట్ పెరగడం సమస్య కూడా ఉంటోందన్నారు. ఈ సమస్యలకు హోలెప్ సరైన పరిష్కారమన్నారు. ఇతర సమస్యలు ఉన్న రోగులకు కూడా చాలా తక్కువ సమస్యలతో సురక్షితమైన, శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. తాజా నిర్వహించిన శస్త్ర చికిత్సతో ఈ తరహా వంద హోలెప్ శస్త్ర చికిత్సలు పూర్తి చేసుకున్నట్టు అయిందన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- నేర చరితులకు పోలీసుల హెచ్చరిక



సస్పెక్ట్ షీటు ఉన్న వ్యక్తులను కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ద్వారకా జోన్ నేర విభాగం సీఐ చక్రధరరావు సస్పెక్ట్ షీటు ఉన్న వ్యక్తులను హెచ్చరించారు. ఎంవీపీ కాలనీ క్రైమ్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ద్వారకా జోన్ పరిధిలో ఉన్న సస్పెక్ట్, రౌడీ షీట్లు ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. దసరా సెలవుల నేపథ్యంలో నగరంలో ఎలాంటి నేరాలకు పాల్పడవద్దని ముందస్తు హెచ్చరిక చేశారు. ఎవరు ఎక్కడ ఉంటున్నారో పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఉండాలని, అలాగే నేరస్థులపై నిరంతర నిఘా ఉంటుందన్న సంగతి మర్చిపోవద్దన్నారు. సత్ప్రవర్తన ఉన్నవారికి భవిష్యత్తులో షీట్లు తొలగించే అవకాశం ఉంటుందన్నారు.

అన్న సమారాధన

వెంకోజీపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రులను పురస్కరించుకుని జీవీఎంసీ 16వ వార్డులో ఆదివారం మహాఅన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఎంటీసీ కాలనీలోని దేవి యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. హెచ్‌బీ కాలనీ రజకవీధిలోని శ్రీలక్ష్మీ గణపతి సద్గురు సాయినాథ దేవాలయం ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు ఈగల సత్యం, ముగడ వాసు, పల్లా బాబు, ఈగల సాయి, ఆర్గనైజింగ్ సభ్యులు మధురవాడ అప్పారావు, అప్పికొండ రాజా, వేమల మణి పెసల కనకరాజు, సిద్దాపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతో నేరాల నియంత్రణ

- చైన్ స్నాచింగ్ చోరీల విషయంలో జాగ్రత్తలు అవసరం
- దసరాకు ఊరెళితే పోలీసులకు సమాచారం ఇవ్వండి
- చక్రధరరావు, ద్వారకా జోన్ సీఐ (నేర విభాగం)



ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల తరచూ జరుగుతున్న గొలుసు దొంగతనాలు, ఇళ్ల చోరీల విషయంలో ప్రజలు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే నేరం జరగకుండా నిరోధించవచ్చని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. నేరం జరిగిన తర్వాత ఇబ్బంది పడే కంటే.. ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవడ వల్ల మేలు జరుగుతుందని ద్వారకా జోన్ నేర విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.చక్రధరరావు తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ గొలుసు దొంగతనాల వల్ల బంగారం కోల్పోవడమే కాకుండా, దుండగులు మెడలో గొలుసు తెంచే ప్రయత్నంలో బాధితులు ప్రమాదాల పాలవుతున్నారన్నారు. ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడా వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఇక దసరా సెలవుల్లో ఇళ్లకు తాళం వేసి, సొంతూర్లకు పయనమయ్యేవారు పోలీసులకు ముందస్తు సమాచారం, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్ వినియోగించుకోవడం ద్వారా నేరం జరగకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ.

గొలుసు దొంగతనాల నుంచి రక్షణ కోసం

దసరా సెలవుల నేపథ్యంలో వీధులు, రహదారులు కొన్ని చోట్ల నిర్మానుష్యంగా ఉండవచ్చు. మహిళలు వాహనంపై ప్రయాణించేటప్పుడు, ఉదయం, సాయంత్రం నడక, ఉదయం పువ్వులు కోసేటప్పుడు, నిర్మానుష్య రహదారుల్లోనూ, రాత్రులు వీధుల్లోనూ నడిచేటప్పుడు మెడలోని బంగారు వస్తువులు కనిపించకుండా వస్త్రం, చీర, చున్నీ వంటివి కప్పుకోవాలి.

ఇంటి వద్దకు ఎవరైనా వచ్చి, నీళ్ల కావాలనో, చిరునామా అడగడానికో, ఇల్లు అద్దెకు కావాలనో, ఇతరత్రా మాటలు కలపడానికి కొత్త వ్యక్తులు వస్తే, తలుపు లేదా గ్రిల్ తెరవకుండా మాట్లాడాలి. ఇంట్లోకి చొరబడే అవకాశం ఇవ్వకూడదు. అలాగే వారి చేతికి అందనంత దూరంగా నిలబడాలి.

రోడ్డు మీద వెళ్లేటప్పుడు, ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు అపరిచిత వ్యక్తులతో సంభాషణ వద్దు. ఇక కొత్తగా పనిలోకి మనుషులను తీసుకున్నప్పుడు వారి ఫోన్ నెంబరు, గుర్తింపు కార్డు కాపీలను తీసుకోవాలి. విలువైన వస్తువులు, తాళాలు వారికి కనిపించేలా ఉంచవద్దు. బంగారు వస్తువులకు మెరుగు పెడతామంటే నమ్మవద్దు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. బ్యాంకుకు వెళ్లినప్పుడు లేదా తిరిగి వచ్చేటప్పుడు మీ చుట్టూ కొద్దిగా డబ్బు పడేసి, మీ దృష్టిని మళ్లించి, మీ వద్ద ఉన్న నగదును దొంగలించే అవకాశం ఉంటుంది. మీ వద్ద ఉన్న క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించిన వివరాలు ఎవరికీ ఇవ్వవద్దు. బ్యాంకు వారు కూడా అడగరు. ఇంటిలో ఒంటరిగా ఉన్నప్పుడు గ్రిల్ తాళం వేసుకుని ఉండండి. అపరిచితులు వస్తే గ్రిల్ తీయకుండా దూరంగా ఉంటూ మాట్లాడండి.

ఊరు వెళితే...

దసరా సెలవులకు ఇల్లు తాళం వేసి ఊరు వెళదామనుకుంటే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్ ద్వారా పోలీసులకు రిక్వెస్ట్ పెట్టుకుంటే ఒక కెమెరా ఇంటిలో అమరుస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఇంట్లోకి ఎవరైనా చొరబడితే పోలీసులకు తెలుస్తుంది.

అలాగే ఊరు వెళుతున్నట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే నైట్ బీట్‌ను ఆ ఇంటివైపు పంపించి, పర్యవేక్షిస్తారు.

విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో ఉంచాలి. లేదా మీతో పాటు తీసుకుని వెళ్లడమో, మరో భద్రమైన చోట ఉంచడమో చేయాలి.అత్యవసర సమయాల్లో 112నెంబరుకు ఫోన్ చేయాలి.

'ఇన్ సర్వీస్ టీచర్లకు 'టెట్' మినహాయించాలి'

పెదగంట్యాడ,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ప రీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు ఒక ప్రకటనలో కోరారు. ఏడేళ్ల పైబడి సర్వీసులో ఉన్న ప్రతి ఉపాధ్యాయుడు టెట్ పరీక్షలో అర్హత సాధించాలని, లేకుంటే ఉపాధ్యాయుడుగా కొనసాగే అర్హత లేదని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో సంబంధిత ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో ఆందోళన మొదలైందని పేర్కొన్నారు.

1995 నుంచి ఇప్పటి వరకు వేర్వేరు డీఎస్సీల ద్వారా వేలమంది ఉపాధ్యాయులుగా నియామకమయ్యారని, వారికి టెట్ ఒక సమస్యగా మారిందని పేర్కొన్నారు. అందువల్ల ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

రసరమ్యంగా కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న గురు సత్యభాను శిష్య బృందం

మద్దిలపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సిద్ధేంద్రయోగి కళానిలయం 32వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురు సత్యభాను శిష్య బృందం కూచిపూడి నృత్యాలు కడురమ్యంగా ప్రదర్శించారు. 120మంది చిన్నారులు కూచిపూడి నాట్యాలు చేస్తూ మైమరించారు. కళ్ల తిప్పనివ్వని ముఖ కదలికలు, హావాభావాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సెంచూరియన్ యూనివర్శిటీ ఉపకులపతి జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు సంప్రదాయ కళలు నేర్చుకునే ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. లెండి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పి. మధుసూదనరావు మాట్లాడుతూ కళాశాలల్లో శాస్త్రీయ కళలు ఏర్పాటు నిమిత్తం ప్రత్యేకమైన గురువులను నియమించడానికి కేంద్రప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. ఇందులో భాగంగా తమ కళాశాలలో నాట్య గురువులకు ప్రాధాన్యమిస్తూ తమ విద్యార్థులకు నృత్యాల్లో శిక్షణ ఇవ్వడానికి సహకరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమలో సిద్ధేంద్రయోగి కళానిలయం వ్యవస్థాపకులు ఎన్ఎస్‌వీ సత్యభాను, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, కన్నం వెంకటరమణారావు, గోపినాథ్ పాల్గొన్నారు.

హృద్రోగంపై అవగాహన పెంపొందించుకోవాలి : సీపీ



వాక్‌థాన్ సందర్భంగా మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

రామ్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు గుండెకు సంబంధించిన ఆరోగ్యంపై అవగాహన పెంచుకొని శ్రద్ధ వహించాలని పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు శనివారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా సెవెన్‌హిల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని గోకుల్ పార్కు నుంచి 'స్టెప్ ఆఫ్ ఫర్ యువర్ హార్ట్, స్టెప్ ఫార్వర్డ్ ఫర్ యువర్ వెల్త్' పేరుతో అవగాహన కల్పిస్తూ వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గుండె సంబంధించిన ఆరోగ్యంపై దృష్టి సారించాలని దేశంలో గుండె జబ్బులు అత్యంత ప్రాణాంతక మైకమైన వ్యాధిగా ఉన్నాయని తలిపారు, అదిక రక్తపోటు, మదుమేహం ను అదుపులో ఉంచుకోవాలని అనారోగ్యకరమైన ఆహారం ఒత్తిడిని తగ్గించుకోవాలని పొగాకు వినియోగం నివారించాలని తెలిపారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాదేళ్ళగిరిబాబు డాక్టర్ జి రాఘవేంద్ర కుమార్, డాక్టర్ దామోదర్‌రావు డా శిరీషా డా హరిత కుమారి తదితరులు పాటు పలువురు పాల్గొన్నారు

అబిద్ నగర్‌లో క్రికెట్ క్రేజీ..



ఆసియాకప్ భారత్-పాకిస్తాన్ ఫైనల్స్ మ్యాచ్ నేపథ్యంలో ఆదివారం నగరంలో క్రికెట్ సందడి నెలకొంది. దాయాదుల మధ్య పోరు కావడంతో మరింత ఉత్కంఠ నెలకొంది. క్రికెట్ క్రీడాభిమానులు, ముఖ్యంగా యువత ఈ మ్యాచ్‌ను అద్యంతం ప్రత్యేక శ్రద్ధాసక్తులతో వీక్షించారు. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అబిద్ నగర్‌లో ఓ చోట కొందరు యువకులు వీధిలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేసుకొని క్రికెట్ చూస్తూ ఉత్సాహంగా మ్యాచ్‌ను వీక్షించారు. ఫైనల్స్‌లో భారత్ విజయంతో యువత ఆనందం ఆకాశమే హద్దు అన్నట్టుగా సందడి చేశారు. - ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

సెంటినరీ మెగా క్రికెట్ కప్ పోటీల్లో ఎంట్రీలకు గడువు పెంపు

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏయూ శతాబ్ది వేడుకల్లో భాగంగా నిర్వహించనున్న మెగా క్రికెట్ కప్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీలను పంపించడానికి వచ్చే నెల 8 వరకు అవకాశం కల్పించినట్టు ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.విజయ్‌మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎంట్రీలను సకాలంలో పంపించేలా చూడాలన్నారు. గోల్డెన్ జూబ్లీ క్రీడా మైదానంలో ప్రారంభ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఏయూ ఇంజనీరింగ్ క్రీడా మైదానంలో కూడా పోటీలు ఉంటాయని తెలిపారు. విన్నింగ్ జట్టుకు రూ.లక్ష, రన్నరప్ జట్టుకు రూ. 50 వేలు నగదు బహుమతి అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 82476 94448, 79898 12773, 98486 68654 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గుండె సంబంధిత సమస్యలపై అవగాహన అవసరం



బీచ్‌రోడ్డులో వాక్‌థాన్‌లో పాల్గొన్న వైద్యులు

మహారాణిపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. దీన్ని 198 బెటాలియన్ కమాండర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎండీ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గత కొంత కాలంగా వయస్సుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని, అందువల్ల అందరూ గుండె సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో చంద్రమౌళీశ్వరరావు, డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు


బోనాల ఊరేగింపులో పాల్గొన్న పూజారి, ప్రముఖులు, భక్తులు

సీతమ్మధార, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురు రోడ్డులో గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి బోనాల పూజలు నిర్వహించారు. మహిళలంతా తలపై కుండలతో దీపాలు వెలిగించి పూజరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్థానికంగా పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమానికి దర్మల గురుమూర్తి రెడ్డి, మజ్జి ఉమామహేశ్వర రెడ్డి, బోర శ్రీనివాసరెడ్డిలు ఆర్థిక సహాయం అందచేశారు.

భక్తులకు అన్నదానం

కంచరపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. తిక్కవానిపాలెం, గంగన్న నగర్, వివేకానందవీధి, గజపతినగర్, ఐటీఐ జంక్షన్, వాడపేట తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. గజపతినగర్‌లోని అమ్మవారి ప్రాంగణంలో భక్తులకు అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమానికి వార్డు టీడీపీ నాయకురాలు పెంటకోట స్రవంతి, కుట్టా కార్తీక్ హాజరై అన్నదానం చేశారు.

జర్నలిస్టుల దసరా సంబరాలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్, మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఆదివారం రైల్వే న్యూకాలనీలోని ఓ హోటల్‌లో దసరా సంబరాలు నిర్వహించారు. మహిళలకు చీరలు, జర్నలిస్టులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జర్నలిస్టు సంఘాల నాయకులు గంగవరపు ఆంజనేయులు, గంట్ల శ్రీనుబాబు, పి.నారాయణ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు గుర్తింపు ఉండాలన్నది జాషువా ఆకాంక్ష



సాలిగ్రామపురంలో జాషువా రచనల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి వేడుకలు ఆదివారం సాలిగ్రామపురంలోని సాగరమాల కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఆయన రచనలను వక్తలు విపులంగా వివరించారు. కులమతాలకు అతీతంగా కవిత్వం ఉండాలని జాషువా ఆకాంక్షించారని, మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉండాలనుకునేవారని చెప్పారు. మానవుడే మహనీయుడని చాటి చెప్పారని గుర్తు చేశారు. అనంతరం జాషువా రచించిన కవిత్వాలతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పరశురామరాజు, ఎం.నాగేంద్ర, సుహాసిని, వేణుగోపాల్, దీపక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కంచరపాలెం: ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి వేడుకలను జీవీఎంసీ 55వ వార్డు జాషువా కళాప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా టీడీపీ నేత కుట్టా కార్తీక్, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. జాషువా తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేశారన్నారు. అనంతరం మెడీకవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కుంచయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలు, వృద్ధులకు చీరలు, నిత్యావసరాల పంపిణీ జరిగింది. అలమండ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

జీకేడీకి జాషువా పురస్కారం

డాక్టర్ జీకేడీ ప్రసాద్‌కు జాషువా పురస్కారం


జీకేడీ ప్రసాదరావును సత్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏయూ జర్నలిజం విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ జీకేడీ ప్రసాదరావుకు గుర్రం జాషువా పురస్కారం లభించింది. ఆదివారం ఆయన ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి పురస్కారం అందుకున్నారు. ఆయనకు రూ.50 వేల నగదు, ప్రశంసాపత్రం, శాలువా, పుష్పగుచ్ఛం అందించారు. ప్రసాదరావు దళితుల సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై వివిధ పత్రికల్లో వందకుపైగా వ్యాసాలు రాశారు. జాషువా సాహిత్యంపై 30కిపైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు. వీటిని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారం ప్రదానం చేశారు.

ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసిన ప్రయాణికులు

... 5వ పేజీ తరువాయి

ప్రత్యేక బస్సులను సమకూర్చేందుకు డిపో మేనేజర్లు అష్టకష్టాలు పడ్డారు. దసరా పండగకు మూడు రోజులే ఉండడం.. వారాంతపు సెలవు కావంతో ఎక్కువ మంది ఆదివారం ప్రయాణాలు పెట్టుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఆర్టీసీకి ప్రయాణికుల తాకిడి పెరిగిపోయింది. విద్య, ఉద్యోగం, వ్యాపార రీత్యా హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, తిరుపతి, భీమవరం వంటి ప్రాంతాల్లో ఉంటున్న ఉత్తరాంధ్ర వాసులు ఆయా ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర రవాణా సాధనాలను వినియోగించుకుని విశాఖ వచ్చేశారు. వీరంతా ఆర్టీసీ బస్సుల్లోనే తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ద్వారకా బస్‌స్టేషన్, సింహాచలం, మద్దిలపాలెం కాంప్లెక్సులకు చేరుకోవడంతో అవి ప్రయాణికులతో కిటకిటలాడాయి. ప్లాట్‌ఫారాలపై నిలిచిన బస్సుల కెపాసిటీకి మూడు నాలుగు రెట్లు ప్రయాణికులు వేచివున్నారు. ఉన్న బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఆర్డినరీ, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం సాగించేందుకు అధిక సంఖ్యలో మహిళలు వాటి కోసం నిరీక్షించారు. రీజియన్‌లోని స్టీల్ సిటీ, గాజువాక, వాల్తేరు డిపోలకు సంబంధించిన స్త్రీశక్తి బస్సులన్నింటినీ ప్రత్యేక సర్వీసులుగా వివిధ రూట్లలో నడిపినప్పటికీ ప్రయాణికుల రద్దీ అలాగే కొనసాగింది. పెరిగిన ప్రయాణికులను నియంత్రించేందుకు ఆర్టీసీ అధికారులు ఆదివారం 65 ప్రత్యేక బస్సులను ఆపరేట్ చేశారు. వీటిని కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, మందస, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం రాజాం ప్రాంతాలకు నడిపారు. సిటీ సర్వీసుల్లో 65 ప్రత్యేక సర్వీసులుగా నడపడంతో సిటీ సర్వీసులకు కొరత ఏర్పడింది.

ఒక్కరోజే 4.2 లక్షల మంది ప్రయాణం

దసరా దృష్ట్యా ఆదివారం ఒక్కరోజే 4.2 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించినట్టు అధికారులు లెక్కలు కట్టారు. ఇందులో 75 శాతానికి పైగా మహిళలు ఉన్నట్టు టిమ్స్ నుంచి జారీ అయిన జీరో టిక్కెట్ల ఆధారంగా లెక్కలు తేల్చారు. విశాఖ రీజియన్‌లోని 780 బస్సుల్లో స్త్రీశక్తి అమలుకు ముందు ప్రతిరోజూ 3.1 లక్షల మంది ప్రయాణించేవారు. స్త్రీశక్తి పథకం అమలు తరువాత ఈ సంఖ్య 4.1 లక్షలకు పెరిగింది. దసరా కారణంగా ఆదివారం నాటికి ఈ సంఖ్య 4.2 లక్షలకు చేరింది.

90 శాతానికి పైగా ఓఆర్

దసరా ప్రయాణికుల రవాణా కారణంగా ఆదివారం 90 శాతానికి పైగా సగటు ఆక్యుపెన్సీ రేషియో నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాదిలో ఇది అత్యధిక ఆక్యుపెన్సీ రేషియోగా అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల డిమాండ్ ఉంటే రాత్రి ప్రత్యేక బస్సులను నడుపుతామని ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు.

స్థలాల క్రమబద్ధీకరణలో చేతివాటం

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నారు. దీంతో సర్వే నంబర్-86, 87ల్లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడిన ముఠాలు పోటాపోటీగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేస్తున్నారు. ప్రసాదరావు లేఅవుట్‌లో కొన్ని ప్లాట్లకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో ముంబైలో ఉన్న ఒకరు తన స్థలం క్రమబద్ధీకరణ కోసం గాజువాకలోని కూటమి నేతను సంప్రదించారు. క్రమబద్ధీకరణ చేయాల్సిన స్థల విస్తీర్ణం పెద్దది కావడంతో రెవెన్యూ అధికారులకు లంచాల కోసం కనీసం రూ.30 లక్షలు ఖర్చవుతుందని సదరు నేత చెప్పడంతో ముంబైలో ఉన్న వ్యక్తి అందుకు అంగీకరించి సొమ్ము చెల్లించారు. అయితే ఈ స్థలం క్రమబద్ధీకరణలో చిన్న సమస్య ఉండడంతో రెవెన్యూ అధికారులు ఆ దరఖాస్తును పక్కన పెట్టేశారు. దీంతో ముంబైకు చెందిన వ్యక్తి తనకు తెలిసిన వారి ద్వారా రెవెన్యూ ఉద్యోగులను కలిసి తాను చెల్లించిన సొమ్ము విషయం వెల్లడించారు. దీంతో ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా రెవెన్యూ అధికారులకు చేరడంతో వారు షాక్‌కు గురై ఈ విషయంపై ఆరా తీశారు.

కాగా కూటమిలో ఉన్న అన్ని పార్టీల నేతలు, విపక్షాలకు చెందిన నాయకులు కూడా కొన్ని ఆక్రమణలకు పాల్పడి వాటిపై తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇదే ప్రాంతంలో కొందరు ఆక్రమణదారులపై కొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఒకే కుటుంబంలో పలువురి పేరుతో ప్లాట్లు ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో గాజువాక రెవెన్యూ అధికారులు క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించే పనిలో ఉన్నట్టు తెలిసింది. గాజువాకలో ఆక్రమణల క్రమబద్ధీకరణపై జిల్లా యంత్రాగం దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు కుమ్మరింత!

... 5వ పేజీ తరువాయి

పనులే ఎక్కువగా ఉన్నాయి. ఇవికాకుండా 67, 93, 96 వార్డుల పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు, నగరంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేస్తున్న తాత్కాలిక కార్మికులకు జీతాల చెల్లింపులు, గాజువాక జోన్‌లోని వివిధ వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను అక్కడి డంపింగ్ యార్డుకు తరలించేందుకు వీలుగా అద్దె వాహనాలు, డ్రైవర్లను సమకూర్చుకోవడం, ముడసర్లోవలోని ఎంఎస్ఎఫ్-3లో అద్దెప్రాతిదికన సమకూర్చుకున్న వాహనాలకు ముగ్గురు డ్రైవర్లను ఆరు నెలలకు నియమించుకోవడం వంటి అంశాలు ఉన్నాయి. స్టాండింగ్ కమిటీ సమావే శం ఏర్పాటు చేస్తున్నట్టు సభ్యులకు జీవీఎంసీ కార్యదర్శి కార్యాలయం నుంచి శనివారం రాత్రి సమాచారం అందడం, ఆదివారం సాయంత్రానికి అజెండా కాపీలను పంపించడం వివాదానికి దారితీసింది. స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు కనీసం మాటమాత్రంగానైనా తమకు చెప్పకపోవడం, ఆదివారం ఉదయానికి కూడా తమకు అజెండా కాపీలు అందకపోవడంతో పలువురు కమిటీ సభ్యులు ఆదివారం ఉదయం జీవీఎంసీ కార్యాలయంలోని ఫ్లోర్ లీడర్ చాంబర్‌లో సమావేశయ్యారు. ఈ సందర్భంగా మేయర్‌తోపాటు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. సోమవారం జరిగే సమావేశంలో అజెండాలోని అంశాలను క్షుణ్ణంగా చదివిన తరువాత, సంబంధిత అధికారుల వివరణ సంతృప్తిగా అనిపిస్తేనే ఆయా అంశాలను ఆమోదించాలని, లేని పక్షంలో వాయిదా కోరాలని తీర్మానించినట్టు సమాచారం.

పోలీసు స్టేషన్ నిర్వహణ తీరుపై సీపీ తీవ్ర అసంతృప్తి


మహారాణిపేట పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న పోలీసు కమిషనర్ బాగ్చి

మహారాణిపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేట పోలీసు స్టేషన్ నిర్వహణ తీరు పట్ల పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఆయన మహారాణిపేట పోలీసు స్టేషన్‌కు వచ్చి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. స్టేషన్ మొత్తం పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు అప్‌డేట్‌గా లేకపోవటం, రౌడీ షీటర్ల రికార్డులు సరిగా లేకపోవడాన్ని గమనించారు. స్టేషన్‌లోపల లాకప్ పరిసరాలను, బయట ప్రదేశాన్ని పరిశీలించారు. అంతటా అపరిశుభ్రంగా ఉండటం, వాహనాలు అస్తవ్యస్తంగా ఉండటం గమనించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో స్టేషన్ పరిశీలనకు వచ్చినప్పుడు సూచనలు చేసినా పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాల్లో మొక్కలు నాటాలని సీపీ ఆదేశించారు.

పాత్రికేయులు ఆరోగ్యంపై దృష్టి నిలపాలి

సీతంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఒత్తిడితో పనిచేసే పాత్రికేయులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఇటీవల పాత్రికేయులు గుండెపోటుతో మరణిస్తున్న సంఘటనలు తనను తీవ్రంగా కలచి వేశాయన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఆయన గుర్తింపు కార్డులను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బండారు అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ నాగనబోయిన నాగేశ్వరరావు, తదితరులు సీపీని సన్మానించారు.

'అణచివేతపై ఉద్యమాలు అవసరం'


ప్రసంగిస్తున్న వేణుగోపాల్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మనువాద కార్పొరేట్ దోపిడీ అణచివేతకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు అవసరమని వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాఫూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావం దినం, భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా మనువాద కార్పొరేట్ ఫాసిజం మూలాలు-ప్రజా ఉద్యమ కర్తవ్యాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ బ్రాహ్మణవాదం, మనువాదం నిచ్చెన మెట్ల వ్యవస్థ మార్గాన్ని ఏర్పరించిందని దుయ్యబట్టారు. జ్యోతిరావు పూలే సత్యశోధక్ సమాజం ఏర్పాటు, పెరియార్ రామస్వామి నాయక్ ఉద్యమం నాస్తికత్వం వంటివి మనువాద దోపిడీని ఉద్యమించారన్నారు. మార్క్స్ కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి, భారతనాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్, పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టీయూ నాయకులు పి.ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై గ్రీన్ పడితే రైట్..రైట్

... 5వ పేజీ తరువాయి

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను సింక్రనైజేషన్ చేయడం ద్వారా ఒక పరిమిత వేగంతో ప్రయాణించే వాహనం ఒకచోట గ్రీన్ సిగ్నల్ దాటి వెళితే తరువాత జంక్షన్‌లో కూడా గ్రీన్ సిగ్నల్ పడివుండేలా సాంకేతిక పరిజ్ఞానంతో సిగ్నల్ వ్యవస్థను మార్చే ప్రతిపాదనపై సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టిసారించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో నిధుల సర్దుబాటు గురించి రెండు నెలల కిందట సీపీ ప్రస్తావించగా.. ఆయన సుముఖత వ్యక్తం చేశారు. దీనిని కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తోపాటు ఎంపీ శ్రీభరత్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీ శ్రీభరత్ వీలైనంత వేగంగా దీనిపై చర్యలు ప్రారంభించాలని సీపీ, జీవీఎంసీ కమిషనర్‌లకు సూచించడంతో గతనెలలో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ ప్రాజెక్టు నిర్వహణలో అనుభవం కలిగిన సంస్థలతో సంప్రతింపులు జరిపారు. హైదరాబాద్, బెంగళూరు, లక్నో, ఢిల్లీ, ఇండోర్ వంటి నగరాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ ప్రాజెక్టులు నిర్వహిస్తున్న బృహస్పతి, అవిరోస్, అర్కడిస్, నయన్ సంస్థలు నగరంలో పైలట్ ప్రాజెక్టు కింద కొన్ని ప్రాంతాల్లో సర్వే చేపట్టాయి.

నాలుగు సిగ్నల్ పాయింట్ల వద్ద ట్రయల్ రన్ నిర్వహించగా విజయవంతమైంది. ఇందుకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇటీవల ఎంపీ శ్రీభరత్ సమక్షంలో కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్‌లకు ఆయా సంస్థలు వివరించాయి. ఎంపీ శ్రీభరత్ సంతృప్తి వ్యక్తం చేయడంతో తక్షణమే ఈ ప్రాజెక్టు నిర్వహణకు ఆర్ఎఫ్‌పీ పిలిచి, అక్టోబరు చివరి నాటికి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు దీనికి అనుగుణంగా చర్యలను వేగవంతం చేశారు. అంతా అనుకున్నట్టు జరిగితే నవంబరు నాటికి నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పోలీస్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైళ్లు, బస్సులు ఫుల్..

... 5వ పేజీ తరువాయి



ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను (12805) మొదలుకుని రాత్రి 11.20 గంటలకు వెళ్లే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ వరకు ప్రయాణికుల తాకిడి నెలకొంది. ప్రధానంగా మధ్యాహ్నం విజయవాడకు బయలుదేరే రత్నాచల్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (12717) ప్రయణికులతో కిక్కిరిసిపోయింది. విజయవాడ నుంచి విశాఖకు చేరిన ప్రయాణికుల సంఖ్య కూడా తోడవ్వడంతో స్టేషన్‌లోని 8వ నంబర్ ప్లాట్‌ఫామ్ రద్దీగా మారింది. రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు చేరాల్సిన కొందరు ప్రయాణికులు తిరుమల ఎక్స్‌ప్రెస్ (18521), విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727) వంటి రైళ్ల జనరల్ కోచ్‌లను ఆశ్రయించడంతో అవి కిక్కిరిసి నడిచాయి. దసరా రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది చేపట్టిన చర్యల కారణంగా రైళ్ల ప్రవేశ ద్వారం వద్ద ఎక్కే, దిగే ప్రయాణికులు నియంత్రణ పాటించడంతో ఎటువంటి దుర్ఘటనలు చోటుచేసుకోలేదు.

చెన్నై, బెంగళూరు, హౌరా రైళ్లు రద్దీ

విశాఖ మీదుగా హౌరా, బెంగళూరు, చెన్నై వెళ్లే రైళ్లకు ఆదివారం నుంచి మరింత రద్దీ పెరిగింది. దసరాకు సొంత ఊర్లకు చేరేవారితో రైళ్లన్నీ రద్దీగా నడిచాయి. దీంతో చెన్నై, హౌరా మధ్య రాకపోకలు సాగించే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12842), మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840), చెన్నై-సంత్రాగచ్చి (22808), చెన్నై-షాలిమార్ (22826) వంటి రైళ్లతో పాటు ఇతర ప్రాంతాల నుంచి హౌరా, చెన్నై చేరే రైళ్లు కిక్కిరిశాయి. అలాగే హౌరా, బెంగళూరు మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), హౌరా-యశ్వంత్‌పూర్ (12863), భువనేశ్వర్-బెంగళూరు వంటి పలు రైళ్లు రద్దీగా నడిచాయి. ఇదిలా ఉండగా విశాఖ మీదుగా హౌరా, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు నడిచే రైళ్లకు అక్టోబరు నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయిన పరిస్థితి ఏర్పడింది.

'గరీబ్‌రథ్'కు అందుబాటులో బెర్తులు

విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు (12739) సోమవారం నుంచి బెర్తులు లభిస్తున్నాయి. అలాగే గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు (12727) కూడా ఏసీ క్లాసు బెర్తులు అందుబాటులో ఉండడం విశేషం. ఈ రెండు రైళ్లకు నవంబరులో కూడా బెర్తులు లభిస్తున్న నేపథ్యంలో దసరా తిరుగు ప్రయాణికులకు ఊరట లభించనున్నది. అలాగే విశాఖలో ఉదయం 5.45 గంటలకు బయలుదేరే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833), మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరే వందేభారత్ (20708) రైళ్లకు దసరా ముందు రోజు కూడా సీట్లు అందుబాటులో ఉన్నాయి. విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు (12805) అక్టోబరు ఆరు వరకు ఏసీ చైర్‌కార్ సీట్లు నిండిపోయాయి. ప్రతి బుధ, శనివారం నడిచే విశాఖ-నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20811)... ప్రతి ఆది, మంగళ, గురువారం నడిచే దురంతో ఎక్స్‌ప్రెస్ (22203)లకు కొన్ని తేదీల్లో బెర్తులు/ఆర్ఏసీ అందుబాటులో ఉన్నాయి. ఇక విశాఖ మీదుగా నడిచే విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12703), కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) వంటి దూరప్రాంత రైళ్లకు అక్టోబరు పదో తేదీ వరకు డిమాండ్ నెలకొంది.

జీఎస్టీ 2.0పై ఇంటింటా ప్రచారం

... 5వ పేజీ తరువాయి

నుంచి ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ సంస్కరణలు, ప్రయోజనాలను తెలియజేయాలంటూ ఆరోగ్యశాఖకు ఆదేశాలు అందాయి. ఇందులో భాగంగానే జిల్లా అంతటా ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలంటూ జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నాలుగు వారాలపాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. నూతన సంస్కరణలకు ముందు జీఎస్టీ శ్లాబులు నాలుగు ఉన్నాయి. 5, 12, 18, 28 శాతం శ్లాబుల్లో పన్నులను వసూలు చేసేవారు. ఈ నెల 22 నుంచి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 పేరుతో సంస్కరణలు చేపట్టింది. నూతన సంస్కరణలతో 5, 18 శాతం శ్లాబుల్లోనే పన్నులను వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు 5, 12 శాతం శ్లాబుల్లో ఉన్న అనేక రకాల వస్తువులు, నిత్యావసర సరకులపై పూర్తిగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తొలగించింది. దీనివల్ల సాధారణ, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇదే విషయాన్ని ప్రజలకు తెలియజేసే కార్యక్రమాలకు తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి.

ఇంటింటికీ వెళ్లి ప్రచారం

జీఎస్టీ నూతన సంస్కరణలకు ముందు ఉన్న శ్లాబులు, నూతన విధానం తరువాత వచ్చిన శ్లాబులు, పూర్తిగా పన్నులు తొలగించిన వస్తువులపై ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆరోగ్యశాఖ సిబ్బంది స్వస్థ్ సశక్త్ పరివార్ అభియాన్ పేరుతో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆయా శిబిరాలకు వచ్చే మహిళలు, ఇతరులకు నూతన సంస్కరణల గురించి తెలియజేయాల్సి ఉంటుంది. అలాగే పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేసే వైద్యులు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశ వర్కర్లు, హెడ్ క్వార్టర్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు నూతన సంస్కరణల గురించి తెలియజేయాల్సి ఉంటుంది. ఆయా ఇళ్లకు వెళ్లి ప్రజలకు వివరిస్తున్న ఫొటోలను సంబంధిత గ్రూపులో షేర్ చేయాలని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు.

వీటిపై ప్రత్యేకంగా..

నూతన సంస్కరణల వల్ల ప్రధానంగా ఆరోగ్య రంగానికి చెందిన వస్తువులు, ఉత్పత్తులపై జీఎస్టీ భారం తగ్గిన తీరును ప్రజలకు పూర్తి స్థాయిలో సిబ్బంది వివరించాల్సి ఉంటుంది. 12 శాతం జీఎస్టీ నుంచి ఐదు శాతానికి, ఐదు శాతం నుంచి జీరోకు తగ్గించిన ఔషధాల గురించి తెలియజేస్తారు. అలాగే కంటిచూపును సరిచేసే వస్తువులపై జీఎస్టీ భారాన్ని 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించారు. దీనివల్ల విద్యార్థులు, వృద్ధులకు కలిగే మేలును వివరించనున్నారు. చిన్నారులు, నవజాత శిశువులకు సంబంధించిన ఉత్పత్తులైన నాప్కిన్లు, లైనర్లు, ఫీడింగ్ బాటిళ్లపై జీఎస్టీ గతంలో 12 శాతం ఉండగా, ప్రస్తుతం ఐదు శాతానికి తగ్గించారు. అదేవిధంగా థర్మామీటర్‌పై ఇప్పటివరకు 18 శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి, యూహెచ్‌టీ పాలపై ఐదు శాతం ఉన్న జీఎస్టీని సున్నాకు తగ్గించారు. వ్యక్తిగత ఆరోగ్య బీమాపై 18 శాతం ఉన్న జీఎస్టీని సున్నాకు తగ్గించడం వల్ల కలిగే లబ్ధిని ప్రజలకు తెలియజేయనున్నారు. అదే సమయంలో క్యాన్సర్‌కు కారణంగా ఉన్న తంబాకు, ఇతర ఉత్పత్తులపై జీఎస్టీని 28 శాతం నుంచి 40 శాతానికి ప్రభుత్వం పెంచింది. ఈ అలవాట్లు ఉన్న ప్రజలకు ఇకపై పెరగనున్న ఆర్థిక భారాన్ని వివరించి వాటికి దూరంగా ఉండేలా అవగాహన కల్పించనున్నారు. దీనిపై ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు నూతన సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను, లబ్ధిని తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఇంటింట ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.

చినముషిడివాడలో చెరువు కబ్జా

... 5వ పేజీ తరువాయి

నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే ఇవి కొందరి చేతులు మారి విక్రయాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఆక్రమించి విక్రయాలు జరపడం సర్వసాధారణమైంది. ఇక్కడ నిర్మాణాలను ఆక్రమణలుగా నిర్ధారించి కొట్టేసినా, కొంతకాలం ఆగి మళ్లీ కట్టేస్తున్నారని, రెవెన్యూ కింది స్థాయి సిబ్బంది సహకారంతోనే నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే సుమారు ఆరు ఎకరాల చెరువు స్థలం పరాధీనమైందని, ఇందులో నిర్మాణాలు చేపట్టారని రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు.

తాజాగా ఇదే తరహాలో ఇక్కడి స్థలాన్ని సుమారు రెండొందల గజాలు ఆక్రమించి నిర్మాణానికి సిద్ధపడటంతో ఈ ఆక్రమణపై తహశీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు రావడంతో చెరువు ఆక్రమణల సంగతి వెలుగులోకి వచ్చింది. చెరువు స్థలాన్ని ఆక్రమించి శ్లాబ్ వేసినా రెవెన్యూ అధికారుల్లో కదలిక లేదు. చెరువులను జీవీఎంసీకి బదలాయింపు జరిపామని, వీటి పరిరక్షణ బాధ్యత వారిదేనని రెవెన్యూ వారు అంటున్నారు. ఇక్కడ పట్టణ ప్రణాళిక అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా.. కాసుల కక్కుర్తితో టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు మేల్కొనకపోతే మిగిలివున్న రూ.కోట్ల విలువైన చెరువు స్థలం కూడా పరాధీనమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా చినముషిడివాడలోని చెరువును సర్వే చేయాలని రెవెన్యూ శాఖ యోచిస్తుండడం ఆక్రమణదారుల్లో గుబులు రేపుతోంది.

ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు

చినముషిడివాడ సర్వే నంబర్-70లో చెరువు స్థలం ఆక్రమణకు సంబంధించి సర్వే చేపడతాం. చెరువుల పరిరక్షణ బాధ్యతను జీవీఎంసీకి బదలాయించిన నేపథ్యంలో ఆక్రమణల విషయాన్ని వారికి లేఖ ద్వారా తెలియపరిచాం. అక్రమ నిర్మాణాలను తొలగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

-ఇంటి వెంకట అప్పారావు, పెందుర్తి తహశీల్దార్

నగరానికి నత్తలు



విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికా నత్తలు నగరంలో కనిపించడం కలకలం రేపుతోంది. ఇప్పటికే గ్రామాల్లో పంటపొలాలపై పడి నత్తలు నష్టానికి గురిచేస్తున్నాయి. నత్తలతో పంటలు పాడవ్వడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నగర శివారు సుజాత నగర్‌లోని పార్కు, పరిసరాల్లోని పలు ఇళ్ల వద్ద నత్తలు కనిపించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పార్కుల్లోని చెట్లు, పండ్ల జాతులకు చెందిన చెట్లు, పూలతోటలపై నత్తల ప్రభావం ఉంటుందని ఉద్యానవన అధికారి ఒకరు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆరిలోవ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హనుమంతువాక కూడలి వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదరుషికొండ ప్రాంతానికి చెందిన అబంటి చైతన్య (29) మృతి చెందాడు. చైతన్య అతడి స్నేహితుడు మధుతో కలిసి బైక్‌పై కైలాసపురంలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చైతన్య ప్రాణాలు కోల్పోగా, మధు స్వల్ప గాయాలతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్‌ఐ శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఈవోఐలకు వ్యతిరేకంగా ప్లాంటు అడ్మిన్ భవనం వద్ద ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటులో ఈవోఐలను రద్దు చేయాలని, ప్లాంటు ప్రైవేటీకరణ ప్రక్రియ విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్లాంటు అడ్మిన్ భవనం వద్ద ధర్నా చేపట్టనున్నట్టు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ధర్నా చేపడతామన్నారు. ఉక్కు కార్మిక వర్గం, నిర్వాసితులు, వివిధ సంఘాల ప్రతినిధులు భారీగా హాజరై ఉక్కు యాజమాన్యానికి తమ నిరసన తెలపాలని పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

స్టీల్‌ప్లాంటు, పరిసర ప్రాంతాల్లో ధర్నాకు అనుమతులు లేవు

- స్టీల్‌ప్లాంటు సీఐ కేశవరావు ప్రకటన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి ధర్నాలు నిర్వహించేందుకు అనుమతులు లేవని స్టీల్‌ప్లాంటే సీఐ ఎ.కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్లాంటు ప్రధాన పరిపాలన భవనం ముందుధర్నాకు నాయకులు పిలుపునిచ్చిన క్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఇతర నాయకులకు అనుమతి లేదని చెప్పటం జరిగిందని సీఐ తెలిపారు. ఒకవేళ ధర్నా చేపట్టాల్సి వస్తే జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేసుకోవచ్చని, కానీ స్టీల్‌ప్లాంటే పరిసరాల్లో చేయరాదని సూచించారు. అనుమతి లేని చోట ధర్నాలు చేస్తే చట్ట రీత్యా తగు చర్యలకు శిక్షార్హులవుతారని తెలిపారు.

సినిమా గైడ్

- **ఓజీ** : మెలోడి, శారద, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),
- **ఘాటీ** : గోకుల్, ముక్తాస్, (గాజువాక)
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 28, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 26, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

రైతు బజార్‌లో అనధికార నిర్మాణం

- ఎలాంటి అనుమతులు లేకుండా టీ దుకాణం పేరుతో శాశ్వత నిర్మాణం
- నోరు మెదపని అధికారులు
- సరుకు రవాణాకు అడ్డుగా ఉందంటూ రైతుల ఆవేదన



రైతుబజార్ ఆవరణలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్డు

పెదవాల్తేరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరు రైబజార్‌లో అధికారుల అనుమతులు లేకుండానే స్టాల్‌ ర్పాటు చేసుకున్నారు. టీ షాపు పేరుతో పక్కగా కట్టాడాలు చేపట్టారు. దీని గురంచి రైతుబజార్‌లోని ఎస్టేట్ ఆధికారి, ఇతర అధికారులు పట్టించుకోలేదు. అయితే ఈ విషయాన్ని మార్కెటింగ్ డీడీ శ్రీనివాసరావును అడగ్గా.. వివరణ కోరగా రైతుబజార్‌లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు లేవని, ఏవైనా నిర్మాణాలు చేపడితే వెంటనే తొలగిస్తామని తెలిపారు. అయితే దుకాణం ఏర్పాటు చేస్తున్న టీ షాపు నిర్వాహకుడిగా అడగ్గా.. గ్రీవెన్స్ సెల్‌లో జేసీకి ఇచ్చిన దరఖాస్తును చూపిస్తూ ఇదే పర్మిషన్ అని చెబుతున్నాడు. ఈ టీ షాపు రైతుబజార్ ప్రదాన గేటుకు అనుకుని కట్టడాలు చేపట్టడంతో ఉదయం, సాయంత్రం రైతుబజార్‌కు వచ్చే సుమారుగా 110 మంది రైతులు తాము వ్యాన్లు, ఆటోలో సరుకులు, కూరగాయలు, టమాటాలు, ఉల్లిపాయలు, పండ్లు, కొబ్బరికాయలు వంటి సరుకులు దించేటప్పుడు అడ్డంగా ఉంటుందని వాపోతున్నారు. వినియోగదారులు తమ వాహనాలు రైతుబజార్‌లోకి తీసుకురావడానికి కూడా ఇబ్బందిగా ఉందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు.

ఈ విధంగా రైతుబజార్‌లో బినామీ షాపులు కూడా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఒకరి పేరు మీద షాపు కేటాయిస్తే, మరొకరికి అద్దెకిచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. రైతుబజార్‌లో ఇంత జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

అప్రమత్తతో నేరాల నియంత్రణ

- చైన్ స్నాచింగ్ చోరీల విషయంలో జాగ్రత్తలు అవసరం
- దసరాకు ఊరెళితే పోలీసులకు సమాచారం ఇవ్వండి
- చక్రధరరావు, ద్వారకా జోన్ సీఐ (నేర విభాగం)



ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల తరచూ జరుగుతున్న గొలుసు దొంగతనాలు, ఇళ్ల చోరీల విషయంలో ప్రజలు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే నేరం జరగకుండా నిరోధించవచ్చని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. నేరం జరిగిన తర్వాత ఇబ్బంది పడే కంటే.. ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవడ వల్ల మేలు జరుగుతుందని ద్వారకా జోన్ నేర విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.చక్రధరరావు తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ గొలుసు దొంగతనాల వల్ల బంగారం కోల్పోవడమే కాకుండా, దుండగులు మెడలో గొలుసు తెంచే ప్రయత్నంలో బాధితులు ప్రమాదాల పాలవుతున్నారన్నారు. ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడా వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఇక దసరా సెలవుల్లో ఇళ్లకు తాళం వేసి, సొంతూర్లకు పయనమయ్యేవారు పోలీసులకు ముందస్తు సమాచారం, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్ వినియోగించుకోవడం ద్వారా నేరం జరగకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ.

గొలుసు దొంగతనాల నుంచి రక్షణ కోసం

దసరా సెలవుల నేపథ్యంలో వీధులు, రహదారులు కొన్ని చోట్ల నిర్మానుష్యంగా ఉండవచ్చు. మహిళలు వాహనంపై ప్రయాణించేటప్పుడు, ఉదయం, సాయంత్రం నడక, ఉదయం పువ్వులు కోసేటప్పుడు, నిర్మానుష్య రహదారుల్లోనూ, రాత్రులు వీధుల్లోనూ నడిచేటప్పుడు మెడలోని బంగారు వస్తువులు కనిపించకుండా వస్త్రం, చీర, చున్నీ వంటివి కప్పుకోవాలి.

ఇంటి వద్దకు ఎవరైనా వచ్చి, నీళ్లు కావాలనో, చిరునామా అడగడానికో, ఇల్లు అద్దెకు కావాలనో, ఇతరత్రా మాటలు కలపడానికి కొత్త వ్యక్తులు వస్తే, తలుపు లేదా గ్రిల్ తెరవకుండా మాట్లాడాలి. ఇంట్లోకి చొరబడే అవకాశం ఇవ్వకూడదు. అలాగే వారి చేతికి అందనంత దూరంగా నిలబడాలి.

రోడ్డు మీద వెళ్లేటప్పుడు, ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు అపరిచిత వ్యక్తులతో సంభాషణ వద్దు. ఇక కొత్తగా పనిలోకి మనుషులను తీసుకున్నప్పుడు వారి ఫోన్ నెంబరు, గుర్తింపు కార్డు కాపీలను తీసుకోవాలి. విలువైన వస్తువులు, తాళాలు వారికి కనిపించేలా ఉంచవద్దు. బంగారు వస్తువులకు మెరుగు పెడతామంటే నమ్మవద్దు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. బ్యాంకుకు వెళ్లినప్పుడు లేదా తిరిగి వచ్చేటప్పుడు మీ చుట్టూ కొద్దిగా డబ్బు పడేసి, మీ దృష్టిని మళ్లించి, మీ వద్ద ఉన్న నగదును దొంగలించే అవకాశం ఉంటుంది. మీ వద్ద ఉన్న క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించిన వివరాలు ఎవరికీ ఇవ్వవద్దు. బ్యాంకు వారు కూడా అడగరు. ఇంటిలో ఒంటరిగా ఉన్నప్పుడు గ్రిల్ తాళం వేసుకుని ఉండండి. అపరిచితులు వస్తే గ్రిల్ తీయకుండా దూరంగా ఉంటూ మాట్లాడండి.

ఊరు వెళితే...

దసరా సెలవులకు ఇల్లు తాళం వేసి ఊరు వెళదామనుకుంటే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్ ద్వారా పోలీసులకు రిక్వెస్ట్ పెట్టుకుంటే ఒక కెమెరా ఇంటిలో అమరుస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఇంట్లోకి ఎవరైనా చొరబడితే పోలీసులకు తెలుస్తుంది.

అలాగే ఊరు వెళుతున్నట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే నైట్ బీట్‌ను ఆ ఇంటివైపు పంపించి, పర్యవేక్షిస్తారు.

విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో ఉంచాలి. లేదా మీతో పాటు తీసుకుని వెళ్లడమో, మరో భద్రమైన చోట ఉంచడమో చేయాలి.అత్యవసర సమయాల్లో 112నెంబరుకు ఫోన్ చేయాలి.

ఆదర్శప్రాయుడు గుర్రం జాషువా

- దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



జాషువాకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

బీచ్ రోడ్డు, సెప్టెంబర్ 28, (ఆంధ్రజ్యోతి) : గుర్రం జాషువా ఆశయాలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం గుర్రం జాషువా జయంతి సందర్భంగా బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నతనం నుంచి సమసమాజ నిర్మాణం కోసం పాలుపడుతూ జాషువా నవయుగ చక్రవర్తిగా పేరు గాంచారన్నారు. కవిత్వమే ఆయుధంగా మూఢాచారాలపై తిరుగుబాటు చేసిన ఆధునిక తెలుగు కవి శ్రీగుర్రం జాషువా 'వడగాల్పు నా జీవితం... వెన్నెల నా సాహిత్యం' అంటూ పేదరికం, వర్గ సంఘర్షణ ఆర్థిక అసమానతలపై పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంచి కవిగా పలు రచనలు చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మాసిపోగు బాబూరాజు, కె.రాంబాబు, కొండపల్లి శ్రీనివాస్, వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్. అప్పారావు, కళాపీఠం అధ్యక్షులు వెంకట్ శానాల తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- నేర చరితులకు పోలీసుల హెచ్చరిక



సస్పెక్ట్ షీటు ఉన్న వ్యక్తులను కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ద్వారకా జోన్ నేర విభాగం సీఐ చక్రధరరావు సస్పెక్ట్ షీటు ఉన్న వ్యక్తులను హెచ్చరించారు. ఎంవీపీ కాలనీ క్రైమ్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ద్వారకా జోన్ పరిధిలో ఉన్న సస్పెక్ట్, రౌడీ షీట్లు ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. దసరా సెలవుల నేపథ్యంలో నగరంలో ఎలాంటి నేరాలకు పాల్పడవద్దని ముందస్తు హెచ్చరిక చేశారు. ఎవరు ఎక్కడ ఉంటున్నారో పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఉండాలని, అలాగే నేరస్థులపై నిరంతర నిఘా ఉంటుందన్న సంగతి మర్చిపోవద్దన్నారు. సత్ప్రవర్తన ఉన్నవారికి భవిష్యత్తులో షీట్లు తొలగించే అవకాశం ఉంటుందన్నారు.

ఏఐఎన్‌యూలో విజయవంతంగా 110 హోలెప్ శస్త్ర చికిత్సలు



వివరాలు వెల్లడిస్తున్న ఏఐఎన్‌యూ వైద్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రోస్టేట్ చికిత్సల్లో నగర పరిధి ద్వారకానగర్‌లోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) సరికొత్త ప్రమాణాలను సృష్టించినట్టు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ వివరాల ను వెల్లడించారు. ఇప్పటి వరకు ఆస్పత్రిలో 100 హోల్మియమ్ లేజర్ ఎన్‌క్లేషన్ ఆఫ్ ద ప్రోస్టేట్ (హోలెప్) శస్త్ర చికిత్సలను ఏఐఎన్ యూలో విజయవంతంగా నిర్వహించినట్టు ఏఐఎన్‌యూ ఎండీ, యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ జి.రవీంద్ర వర్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అమిత్ సాప్లే, డాక్టర్ పి.శ్రీధర్ వెల్లడించారు. ప్రోస్టేట్ సమస్యలకు, బినైన్ ప్రోస్టేట్ హైపర్ ప్లాసియా (బీపీహెచ్)కి అతి తక్కువ కోతతోనే అత్యాధునిక శస్త్ర చికిత్సలను చేస్తున్నామన్నారు. ఇది ఆస్పత్రి వైద్యులు నైపుణ్యానికి నిదర్శనంగా పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలు, శిక్షణ పొందిన సిబ్బంది, లేజర్ టెక్నాలజీ సాయంతో హోలెప్ చికిత్సలు చేస్తున్నట్టు తెలిపారు. హోలెప్ శస్త్ర చికిత్సలు నిర్వహణలో ఈ తరహా నైపుణ్యం కలిగిన ఆస్పత్రులు అతి తక్కువ ఉన్నాయని, వాటి సరసన ఇప్పుడు నగరంలోని ఏఐఎన్‌యూ నిలిచింద న్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరగడంతో చాలా మంది పురుషులకు మధుమేహం, అధిక రక్తపోటు, గుండెసమస్యలకు తోడు ప్రోస్టేట్ పెరగడం సమస్య కూడా ఉంటోందన్నారు. ఈ సమస్యలకు హోలెప్ సరైన పరిస్కారామన్నారు. ఇతర సమస్యలు ఉన్న రోగులకు కూడా చాలా తక్కువ సమస్యలతో సురక్షితమైన, శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. తాజా నిర్వహించిన శస్త్ర చికిత్సతో ఈ తరహా వంద హోలెప్ శస్త్ర చికిత్సలు పూర్తి చేసుకున్నట్టు అయిందన్నారు.

అన్న సమారాధన

వెంకోజీపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రులను పురస్కరించుకుని జీవీఎంసీ 16వ వార్డులో ఆదివారం మహాఅన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఎంటీసీ కాలనీలోని దేవి యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. హెచ్‌బీ కాలనీ రజకవీధిలోని శ్రీలక్ష్మీ గణపతి సద్గురు సాయినాథ దేవాలయం ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు ఈగల సత్యం, ముగడ వాసు, పల్లా బాబు, ఈగల సాయి, ఆర్గనైజింగ్ సభ్యులు మధురవాడ అప్పారావు, అప్పికొండ రాజా, వేమల మణి పెసల కనకరాజు, సిద్దాపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'ఇన్ సర్వీస్ టీచర్లకు 'టెట్' మినహాయించాలి'

పెదగంట్యాడ,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ప రీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు ఒక ప్రకటనలో కోరారు. ఏడేళ్ల పైబడి సర్వీసులో ఉన్న ప్రతి ఉపాధ్యాయుడు టెట్ పరీక్షలో అర్హత సాధించాలని, లేకుంటే ఉపాధ్యాయుడుగా కొనసాగే అర్హత లేదని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో సంబంధిత ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో ఆందోళన మొదలైందని పేర్కొన్నారు.

1995 నుంచి ఇప్పటి వరకు వేర్వేరు డీఎస్సీల ద్వారా వేలమంది ఉపాధ్యాయులుగా నియామకమయ్యారని, వారికి టెట్ ఒక సమస్యగా మారిందని పేర్కొన్నారు. అందువల్ల ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

రసరమ్యంగా కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న గురు సత్యభాను శిష్య బృందం

మద్దిలపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సిద్ధేంద్రయోగి కళానిలయం 32వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురు సత్యభాను శిష్య బృందం కూచిపూడి నృత్యాలు కడురమ్యంగా ప్రదర్శించారు. 120మంది చిన్నారులు కూచిపూడి నాట్యాలు చేస్తూ మైమరించారు. కళ్ల తిప్పనివ్వని ముఖ కదలికలు, హావాభావాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి జీఎస్‌ఎన్ రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు సంప్రదాయ కళలు నేర్చుకునే ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. లెండి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు మాట్లాడుతూ కళాశాలల్లో శాస్త్రీయ కళలు ఏర్పాటు నిమిత్తం ప్రత్యేకమైన గురువులను నియమించడానికి కేంద్రప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. ఇందులో భాగంగా తమ కళాశాలలో నాట్య గురువులకు ప్రాధాన్యమిస్తూ తమ విద్యార్థులకు నృత్యాల్లో శిక్షణ ఇవ్వడానికి సహకరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమలో సిద్ధేంద్రయోగి కళానిలయం వ్యవస్థాపకులు ఎన్ఎన్‌వీ సత్యభాను, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, కన్నం వెంకటరమణారావు, గోపినాథ్ పాల్గొన్నారు.

హృద్రోగంపై అవగాహన పెంపొందించుకోవాలి : సీపీ



వాక్‌థాన్ సందర్భంగా మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

రామ్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు గుండెకు సంబంధించిన ఆరోగ్యంపై అవగాహన పెంచుకొని శ్రద్ధ వహించాలని పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు శనివారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా సెవెన్‌హిల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని గోకుల్ పార్కు నుంచి 'స్టెప్ ఆఫ్ ఫర్ యువర్ హార్ట్, స్టెప్ ఫార్వర్డ్ ఫర్ యువర్ వెల్త్' పేరుతో అవగాహన కల్పిస్తూ వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గుండె సంబందించిన ఆరోగ్యంపై దృష్టి సారించాలని దేశంలో గుండె జబ్బులు అత్యంత ప్రాణాంతక మైకమైన వ్యాదిగా ఉన్నాయని తెలిపారు, అదిక రక్తపోటు, మదుమేహం ను అదుపులో ఉంచుకోవాలని అనారోగ్యకరమైన ఆహారం ఒత్తిడిని తగ్గించుకోవాలని పొగాకు వినియోగం నివారించాలని తెలిపారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాదేళ్లగిరిబాబు డాక్టర్ జి రాఘవేంద్ర కుమార్, డాక్టర్ దామోదర్‌రావు డా శీరిషా డా హరిత కుమారి తదితరులు పాటు పలువురు పాల్గొన్నారు

● అబిడ్ నగర్‌లో క్రికెట్ క్రేజీ..



ఆసియాకప్ భారత్-పాకిస్తాన్ ఫైనల్స్ మ్యాచ్ నేపథ్యంలో ఆదివారం నగరంలో క్రికెట్ సందడి నెలకొంది. దాయాదుల మధ్య పోరు కావడంతో మరింత ఉత్కంఠ నెలకొంది. క్రికెట్ క్రీడాభిమానులు, ముఖ్యంగా యువత ఈ మ్యాచ్‌ను ఆద్యంతం ప్రత్యేక శ్రద్ధాసక్తులతో వీక్షించారు. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అబిడ్ నగర్‌లో ఓ చోట కొందరు యువకులు వీధిలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేసుకొని క్రికెట్ చూస్తూ ఉత్సాహంగా మ్యాచ్‌ను వీక్షించారు. ఫైనల్స్‌లో భారత్ విజయంతో యువత ఆనందం ఆకాశమే హద్దు అన్నట్టుగా సందడి చేశారు. - ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

సెంటినరీ మెగా క్రికెట్ కప్ పోటీల్లో ఎంట్రీలకు గడువు పెంపు

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏయూ శతాబ్ది వేడుకల్లో భాగంగా నిర్వహిం చనున్న మెగా క్రికెట్ కప్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీలను పంపించడానికి వచ్చే నెల 8 వరకు అవకాశం కల్పించినట్టు ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.విజయ్‌మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎంట్రీలను సకాలంలో పంపించేలా చూడాలన్నారు. గోల్డెన్ జూబ్లీ క్రీడా మైదానంలో ప్రారంభ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఏయూ ఇంజనీరింగ్ క్రీడా మైదానంలో కూడా పోటీలు ఉంటాయని తెలిపారు. విన్నింగ్ జట్టుకు రూ.లక్ష, రన్నరప్ జట్టుకు రూ. 50 వేలు నగదు బహుమతి అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 82476 94448, 79898 12773, 98486 68654 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గుండె సంబంధిత సమస్యలపై అవగాహన అవసరం



బీచ్‌రోడ్డులో వాక్‌థాన్‌లో పాల్గొన్న వైద్యులు

మహారాణిపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. దీన్ని 198 బెటాలియన్ కమాండర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎండీ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గత కొంత కాలంగా వయస్సుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని, అందువల్ల అందరూ గుండె సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో చంద్రమౌళీశ్వరరావు, డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు


బోనాల ఊరేగింపులో పాల్గొన్న పూజారి, ప్రముఖులు, భక్తులు

సీతమ్మధార, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురు రోడ్డులో గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి బోనాల పూజలు నిర్వహించారు. మహిళలంతా తలపై కుండలతో దీపాలు వెలిగించి పూజరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్థానికంగా పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమానికి ధర్మల గురుమూర్తి రెడ్డి, మజ్జి ఉమామహేశ్వర రెడ్డి, బోర శ్రీనివాసరెడ్డిలు ఆర్థిక సహాయం అందచేశారు.

భక్తులకు అన్నదానం

కంచరపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. తిక్కవానిపాలెం, గంగన్న నగర్, వివేకానందవీధి, గజపతినగర్, ఐటీఐ జంక్షన్, వాడపేట తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. గజపతినగర్‌లోని అమ్మవారి ప్రాంగణంలో భక్తులకు అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమానికి వార్డు టీడీపీ నాయకురాలు పెంటకోట స్రవంతి, కుట్టా కార్తీక్ హాజరై అన్నదానం చేశారు.

జర్నలిస్టుల దసరా సంబరాలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్, మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఆదివారం రైల్వే న్యూకాలనీలోని ఓ హోటల్‌లో దసరా సంబరాలు నిర్వహించారు. మహిళలకు చీరలు, జర్నలిస్టులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జర్నలిస్టు సంఘాల నాయకులు గంగవరపు ఆంజనేయులు, గంట్ల శ్రీనుబాబు, పి.నారాయణ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు గుర్తింపు ఉండాలన్నది జాషువా ఆకాంక్ష



సాలిగ్రామపురంలో జాషువా రచనల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

డాక్టర్ జీకేడీ ప్రసాద్‌కు జాషువా పురస్కారం


జీకేడీ ప్రసాదరావును సత్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి వేడుకలు ఆదివారం సాలిగ్రామపురంలోని సాగరమాల కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఆయన రచనలను వక్తలు విపులంగా వివరించారు. కులమతాలకు అతీతంగా కవిత్వం ఉండాలని జాషువా ఆకాంక్షించారని, మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉండాలనుకునేవారని చెప్పారు. మానవుడే మహనీయుడని చాటి చెప్పారని గుర్తు చేశారు. అనంతరం జాషువా రచించిన కవిత్వాలతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పరశురామరాజు, ఎం.నాగేంద్ర, సుహాసిని, వేణుగోపాల్, దీపక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కంచరపాలెం: ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి వేడుకలను జీవీఎంసీ 55వ వార్డు జాషువా కళాప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా టీడీపీ నేత కుట్టా కార్తీక్, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. జాషువా తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేశారన్నారు. అనంతరం మెడీకవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కుంచయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలు, వృద్ధులకు చీరలు, నిత్యావసరాల పంపిణీ జరిగింది. అలమండ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

జీకేడీకి జాషువా పురస్కారం

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏయూ జర్నలిజం విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ జీకేడీ ప్రసాదరావుకు గుర్రం జాషువా పురస్కారం లభించింది. ఆదివారం ఆయన ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి పురస్కారం అందుకున్నారు. ఆయనకు రూ.50 వేల నగదు, ప్రశంసాపత్రం, శాలువా, పుష్పగుచ్ఛం అందించారు. ప్రసాదరావు దళితుల సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై వివిధ పత్రికల్లో వందకుపైగా వ్యాసాలు రాశారు. జాషువా సాహిత్యంపై 30కిపైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు. వీటిని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారం ప్రదానం చేశారు.

ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసిన ప్రయాణికులు

... 5వ పేజీ తరువాయి

ప్రత్యేక బస్సులను సమకూర్చేందుకు డిపో మేనేజర్లు అష్టకష్టాలు పడ్డారు. దసరా పండగకు మూడు రోజులే ఉండడం.. వారాంతపు సెలవు కావంతో ఎక్కువ మంది ఆదివారం ప్రయాణాలు పెట్టుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఆర్టీసీకి ప్రయాణికుల తాకిడి పెరిగిపోయింది. విద్య, ఉద్యోగం, వ్యాపార రీత్యా హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, తిరుపతి, భీమవరం వంటి ప్రాంతాల్లో ఉంటున్న ఉత్తరాంధ్ర వాసులు ఆయా ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర రవాణా సాధనాలను వినియోగించుకుని విశాఖ వచ్చేశారు. వీరంతా ఆర్టీసీ బస్సుల్లోనే తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ద్వారకా బస్‌స్టేషన్, సింహాచలం, మద్దిలపాలెం కాంప్లెక్సులకు చేరుకోవడంతో అవి ప్రయాణికులతో కిటకిటలాడాయి. ప్లాట్‌ఫారాలపై నిలిచిన బస్సుల కెపాసిటీకి మూడు నాలుగు రెట్లు ప్రయాణికులు వేచివున్నారు. ఉన్న బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఆర్డినరీ, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం సాగించేందుకు అధిక సంఖ్యలో మహిళలు వాటి కోసం నిరీక్షించారు. రీజియన్‌లోని స్టీల్ సిటీ, గాజువాక, వాల్తేరు డిపోలకు సంబంధించిన స్త్రీశక్తి బస్సులన్నింటినీ ప్రత్యేక సర్వీసులుగా వివిధ రూట్లలో నడిపినప్పటికీ ప్రయాణికుల రద్దీ అలాగే కొనసాగింది. పెరిగిన ప్రయాణికులను నియంత్రించేందుకు ఆర్టీసీ అధికారులు ఆదివారం 65 ప్రత్యేక బస్సులను ఆపరేట్ చేశారు. వీటిని కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, మందస, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం రాజాం ప్రాంతాలకు నడిపారు. సిటీ సర్వీసుల్లో 65 ప్రత్యేక సర్వీసులుగా నడపడంతో సిటీ సర్వీసులకు కొరత ఏర్పడింది.

ఒక్కరోజే 4.2 లక్షల మంది ప్రయాణం

దసరా దృష్ట్యా ఆదివారం ఒక్కరోజే 4.2 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించినట్టు అధికారులు లెక్కలు కట్టారు. ఇందులో 75 శాతానికి పైగా మహిళలు ఉన్నట్టు టిమ్స్ నుంచి జారీ అయిన జీరో టిక్కెట్ల ఆధారంగా లెక్కలు తేల్చారు. విశాఖ రీజియన్‌లోని 780 బస్సుల్లో స్త్రీశక్తి అమలుకు ముందు ప్రతిరోజూ 3.1 లక్షల మంది ప్రయాణించేవారు. స్త్రీశక్తి పథకం అమలు తరువాత ఈ సంఖ్య 4.1 లక్షలకు పెరిగింది. దసరా కారణంగా ఆదివారం నాటికి ఈ సంఖ్య 4.2 లక్షలకు చేరింది.

90 శాతానికి పైగా ఓఆర్

దసరా ప్రయాణికుల రవాణా కారణంగా ఆదివారం 90 శాతానికి పైగా సగటు ఆక్యుపెన్సీ రేషియో నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాదిలో ఇది అత్యధిక ఆక్యుపెన్సీ రేషియోగా అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల డిమాండ్ ఉంటే రాత్రి ప్రత్యేక బస్సులను నడుపుతామని ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు.

స్థలాల క్రమబద్ధీకరణలో చేతివాటం

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నారు. దీంతో సర్వే నంబర్-86, 87లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడిన ముఠాలు పోటాపోటీగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేస్తున్నారు. ప్రసాదరావు లేఅవుట్‌లో కొన్ని ప్లాట్లకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో ముంబైలో ఉన్న ఒకరు తన స్థలం క్రమబద్ధీకరణ కోసం గాజువాకలోని కూటమి నేతను సంప్రదించారు. క్రమబద్ధీకరణ చేయాల్సిన స్థల విస్తీర్ణం పెద్దది కావడంతో రెవెన్యూ అధికారులకు లంచాల కోసం కనీసం రూ.30 లక్షలు ఖర్చవుతుందని సదరు నేత చెప్పడంతో ముంబైలో ఉన్న వ్యక్తి అందుకు అంగీకరించి సొమ్ము చెల్లించారు. అయితే ఈ స్థలం క్రమబద్ధీకరణలో చిన్న సమస్య ఉండడంతో రెవెన్యూ అధికారులు ఆ దరఖాస్తును పక్కన పెట్టేశారు. దీంతో ముంబైకు చెందిన వ్యక్తి తనకు తెలిసిన వారి ద్వారా రెవెన్యూ ఉద్యోగులను కలిసి తాను చెల్లించిన సొమ్ము విషయం వెల్లడించారు. దీంతో ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా రెవెన్యూ అధికారులకు చేరడంతో వారు షాక్‌కు గురై ఈ విషయంపై ఆరా తీశారు.

కాగా కూటమిలో ఉన్న అన్ని పార్టీల నేతలు, విపక్షాలకు చెందిన నాయకులు కూడా కొన్ని ఆక్రమణలకు పాల్పడి వాటిపై తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇదే ప్రాంతంలో కొందరు ఆక్రమణదారులపై కొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఒకే కుటుంబంలో పలువురి పేరుతో ప్లాట్లు ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో గాజువాక రెవెన్యూ అధికారులు క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించే పనిలో ఉన్నట్టు తెలిసింది. గాజువాకలో ఆక్రమణల క్రమబద్ధీకరణపై జిల్లా యంత్రాగం దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు కుమ్మరింత!

... 5వ పేజీ తరువాయి

పనులే ఎక్కువగా ఉన్నాయి. ఇవికాకుండా 67, 93, 96 వార్డుల పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు, నగరంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేస్తున్న తాత్కాలిక కార్మికులకు జీతాల చెల్లింపులు, గాజువాక జోన్‌లోని వివిధ వార్డులో పేరుకుపోయిన చెత్తను అక్కడి డంపింగ్ యార్డుకు తరలించేందుకు వీలుగా అద్దె వాహనాలు, డ్రైవరన్లు సమకూర్చుకోవడం, ముడసర్లోవలోని ఎంఎస్ఎఫ్-3లో అద్దెప్రాతిదికన సమకూర్చుకున్న వాహనాలకు ముగ్గురు డ్రైవర్లను ఆరు నెలలకు నియమించుకోవడం వంటి అంశాలు ఉన్నాయి. స్టాండింగ్ కమిటీ సమావే శం ఏర్పాటు చేస్తున్నట్టు సభ్యులకు జీవీఎంసీ కార్యదర్శి కార్యాలయం నుంచి శనివారం రాత్రి సమాచారం అందడం, ఆదివారం సాయంత్రానికి అజెండా కాపీలను పంపించడం వివాదానికి దారితీసింది. స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు కనీసం మాటమాత్రంగానైనా తమకు చెప్పకపోవడం, ఆదివారం ఉదయానికి కూడా తమకు అజెండా కాపీలు అందకపోవడంతో పలువురు కమిటీ సభ్యులు ఆదివారం ఉదయం జీవీఎంసీ కార్యాలయంలోని ఫ్లోర్ లీడర్ చాంబర్‌లో సమావేశయ్యారు. ఈ సందర్భంగా మేయర్‌తోపాటు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. సోమవారం జరిగే సమావేశంలో అజెండాలోని అంశాలను క్షుణ్ణంగా చదివిన తరువాత, సంబంధిత అధికారుల వివరణ సంతృప్తిగా అనిపిస్తేనే ఆయా అంశాలను ఆమోదించాలని, లేని పక్షంలో వాయిదా కోరాలని తీర్మానించినట్టు సమాచారం.

పోలీసు స్టేషన్ నిర్వహణ తీరుపై సీపీ తీవ్ర అసంతృప్తి


మహారాణిపేట పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న పోలీసు కమిషనర్ బాగ్చి

మహారాణిపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేట పోలీసు స్టేషన్ నిర్వహణ తీరు పట్ల పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఆయన మహారాణిపేట పోలీసు స్టేషన్‌కు వచ్చి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. స్టేషన్ మొత్తం పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు అప్‌డేట్‌గా లేకపోవటం, రౌడీ షీటర్ల రికార్డులు సరిగా లేకపోవడాన్ని గమనించారు. స్టేషన్‌లోపల లాకప్ పరిసరాలను, బయట ప్రదేశాన్ని పరిశీలించారు. అంతటా అపరిశుభ్రంగా ఉండటం, వాహనాలు అస్తవ్యస్తంగా ఉండటం గమనించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో స్టేషన్ పరిశీలనకు వచ్చినప్పుడు సూచనలు చేసినా పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాల్లో మొక్కలు నాటాలని సీపీ ఆదేశించారు.

పాత్రికేయులు ఆరోగ్యంపై దృష్టి నిలపాలి

సీతంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఒత్తిడితో పనిచేసే పాత్రికేయులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఇటీవల పాత్రికేయులు గుండెపోటుతో మరణిస్తున్న సంఘటనలు తనను తీవ్రంగా కలచి వేశాయన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఆయన గుర్తింపు కార్డులను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బండారు అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ ఛైర్మన్ నాగనబోయిన నాగేశ్వరరావు, తదితరులు సీపీని సన్మానించారు.

'అణచివేతపై ఉద్యమాలు అవసరం'



ప్రసంగిస్తున్న వేణుగోపాల్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మనువాద కార్పొరేట్ దోపిడీ అణచివేతకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు అవసరమని వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాఫూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావం దినం, భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా మనువాద కార్పొరేట్ ఫాసిజం మూలాలు-ప్రజా ఉద్యమ కర్తవ్యాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ బ్రాహ్మణవాదం, మనువాదం నిచ్చెన మెట్ల వ్యవస్థ మార్గాన్ని ఏర్పరించిందని దుయ్యబట్టారు. జ్యోతిరావు పూలే సత్యశోధక్ సమాజం ఏర్పాటు, పెరియార్ రామస్వామి నాయక్ ఉద్యమం నాస్తికత్వం వంటివి మనువాద దోపిడీని ఉద్యమించారన్నారు. మార్క్స్ కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి, భారతనాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్, పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టీయూ నాయకులు పి.ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు, బస్సులు ఫుల్..

... 5వ పేజీ తరువాయి



ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను (12805) మొదలుకుని రాత్రి 11.20 గంటలకు వెళ్లే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ వరకు ప్రయాణికుల తాకిడి నెలకొంది. ప్రధానంగా మధ్యాహ్నం విజయవాడకు బయలుదేరే రత్నాచల్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (12717) ప్రయణికులతో కిక్కిరిసిపోయింది. విజయవాడ నుంచి విశాఖకు చేరిన ప్రయాణికుల సంఖ్య కూడా తోడవ్వడంతో స్టేషన్‌లోని 8వ నంబర్ ప్లాట్‌ఫామ్ రద్దీగా మారింది. రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు చేరాల్సిన కొందరు ప్రయాణికులు తిరుమల ఎక్స్‌ప్రెస్ (18521), విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727) వంటి రైళ్ల జనరల్ కోచ్‌లను ఆశ్రయించడంతో అవి కిక్కిరిసి నడిచాయి. దసరా రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది చేపట్టిన చర్యల కారణంగా రైళ్ల ప్రవేశ ద్వారం వద్ద ఎక్కే, దిగే ప్రయాణికులు నియంత్రణ పాటించడంతో ఎటువంటి దుర్ఘటనలు చోటుచేసుకోలేదు.

చెన్నై, బెంగళూరు, హౌరా రైళ్లు రద్దీ

విశాఖ మీదుగా హౌరా, బెంగళూరు, చెన్నై వెళ్లే రైళ్లకు ఆదివారం నుంచి మరింత రద్దీ పెరిగింది. దసరాకు సొంత ఊర్లకు చేరేవారితో రైళ్లన్నీ రద్దీగా నడిచాయి. దీంతో చెన్నై, హౌరా మధ్య రాకపోకలు సాగించే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12842), మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840), చెన్నై-సంత్రాగచ్చి (22808), చెన్నై-షాలిమార్ (22826) వంటి రైళ్లతో పాటు ఇతర ప్రాంతాల నుంచి హౌరా, చెన్నై చేరే రైళ్లు కిక్కిరిశాయి. అలాగే హౌరా, బెంగళూరు మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), హౌరా-యశ్వంత్‌పూర్ (12863), భువనేశ్వర్-బెంగళూరు వంటి పలు రైళ్లు రద్దీగా నడిచాయి. ఇదిలా ఉండగా విశాఖ మీదుగా హౌరా, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు నడిచే రైళ్లకు అక్టోబరు నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయిన పరిస్థితి ఏర్పడింది.

'గరీబ్‌రథ్'కు అందుబాటులో బెర్తులు

విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు (12739) సోమవారం నుంచి బెర్తులు లభిస్తున్నాయి. అలాగే గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు (12727) కూడా ఏసీ క్లాసు బెర్తులు అందుబాటులో ఉండడం విశేషం. ఈ రెండు రైళ్లకు నవంబరులో కూడా బెర్తులు లభిస్తున్న నేపథ్యంలో దసరా తిరుగు ప్రయాణికులకు ఊరట లభించనున్నది. అలాగే విశాఖలో ఉదయం 5.45 గంటలకు బయలుదేరే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833), మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరే వందేభారత్ (20708) రైళ్లకు దసరా ముందు రోజు కూడా సీట్లు అందుబాటులో ఉన్నాయి. విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు (12805) అక్టోబరు ఆరు వరకు ఏసీ ఛైర్‌కార్ సీట్లు నిండిపోయాయి. ప్రతి బుధ, శనివారం నడిచే విశాఖ-నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20811)... ప్రతి ఆది, మంగళ, గురువారం నడిచే దురంతో ఎక్స్‌ప్రెస్ (22203)లకు కొన్ని తేదీల్లో బెర్తులు/ఆర్ఏసీ అందుబాటులో ఉన్నాయి. ఇక విశాఖ మీదుగా నడిచే విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12703), కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) వంటి దూరప్రాంత రైళ్లకు అక్టోబరు పదో తేదీ వరకు డిమాండ్ నెలకొంది.

జీఎస్టీ 2.0పై ఇంటింటా ప్రచారం

... 5వ పేజీ తరువాయి

నుంచి ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ సంస్కరణలు, ప్రయోజనాలను తెలియజేయాలంటూ ఆరోగ్యశాఖకు ఆదేశాలు అందాయి. ఇందులో భాగంగానే జిల్లా అంతటా ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలంటూ జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నాలుగు వారాలపాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. నూతన సంస్కరణలకు ముందు జీఎస్టీ శ్లాబులు నాలుగు ఉన్నాయి. 5, 12, 18, 28 శాతం శ్లాబుల్లో పన్నులను వసూలు చేసేవారు. ఈ నెల 22 నుంచి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 పేరుతో సంస్కరణలు చేపట్టింది. నూతన సంస్కరణలతో 5, 18 శాతం శ్లాబుల్లోనే పన్నులను వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు 5, 12 శాతం శ్లాబుల్లో ఉన్న అనేక రకాల వస్తువులు, నిత్యావసర సరకులపై పూర్తిగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తొలగించింది. దీనివల్ల సాధారణ, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇదే విషయాన్ని ప్రజలకు తెలియజేసే కార్యక్రమాలకు తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి.

ఇంటింటికీ వెళ్లి ప్రచారం

జీఎస్టీ నూతన సంస్కరణలకు ముందు ఉన్న శ్లాబులు, నూతన విధానం తరువాత వచ్చిన శ్లాబులు, పూర్తిగా పన్నులు తొలగించిన వస్తువులపై ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆరోగ్యశాఖ సిబ్బంది స్వస్థ్ సశక్త్ పరివార్ అభియాన్ పేరుతో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆయా శిబిరాలకు వచ్చే మహిళలు, ఇతరులకు నూతన సంస్కరణల గురించి తెలియజేయాల్సి ఉంటుంది. అలాగే పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేసే వైద్యులు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశ వర్కర్లు, హెడ్ క్వార్టర్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు నూతన సంస్కరణల గురించి తెలియజేయాల్సి ఉంటుంది. ఆయా ఇళ్లకు వెళ్లి ప్రజలకు వివరిస్తున్న ఫొటోలను సంబంధిత గ్రూపులో షేర్ చేయాలని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు.

వీటిపై ప్రత్యేకంగా..

నూతన సంస్కరణల వల్ల ప్రధానంగా ఆరోగ్య రంగానికి చెందిన వస్తువులు, ఉత్పత్తులపై జీఎస్టీ భారం తగ్గిన తీరును ప్రజలకు పూర్తి స్థాయిలో సిబ్బంది వివరించాల్సి ఉంటుంది. 12 శాతం జీఎస్టీ నుంచి ఐదు శాతానికి, ఐదు శాతం నుంచి జీరోకు తగ్గించిన ఔషధాల గురించి తెలియజేస్తారు. అలాగే కంటిచూపును సరిచేసే వస్తువులపై జీఎస్టీ భారాన్ని 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించారు. దీనివల్ల విద్యార్థులు, వృద్ధులకు కలిగే మేలును వివరించనున్నారు. చిన్నారులు, నవజాత శిశువులకు సంబంధించిన ఉత్పత్తులైన నాప్కిన్లు, లైనర్లు, ఫీడింగ్ బాటిళ్లపై జీఎస్టీ గతంలో 12 శాతం ఉండగా, ప్రస్తుతం ఐదు శాతానికి తగ్గించారు. అదేవిధంగా థర్మామీటర్‌పై ఇప్పటివరకు 18 శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి, యూహెచ్‌టీ పాలపై ఐదు శాతం ఉన్న జీఎస్టీని సున్నాకు తగ్గించారు. వ్యక్తిగత ఆరోగ్య బీమాపై 18 శాతం ఉన్న జీఎస్టీని సున్నాకు తగ్గించడం వల్ల కలిగే లబ్ధిని ప్రజలకు తెలియజేయనున్నారు. అదే సమయంలో క్యాన్సర్‌కు కారణంగా ఉన్న తంబాకు, ఇతర ఉత్పత్తులపై జీఎస్టీని 28 శాతం నుంచి 40 శాతానికి ప్రభుత్వం పెంచింది. ఈ అలవాట్లు ఉన్న ప్రజలకు ఇకపై పెరగనున్న ఆర్థిక భారాన్ని వివరించి వాటికి దూరంగా ఉండేలా అవగాహన కల్పించనున్నారు. దీనిపై ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు నూతన సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను, లబ్ధిని తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఇంటింట ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.

చినముషిడివాడలో చెరువు కబ్జా

... 5వ పేజీ తరువాయి

నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే ఇవి కొందరి చేతులు మారి విక్రయాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఆక్రమించి విక్రయాలు జరపడం సర్వసాధారణమైంది. ఇక్కడ నిర్మాణాలను ఆక్రమణలుగా నిర్ధారించి కొట్టేసినా, కొంతకాలం ఆగి మళ్లీ కట్టేస్తున్నారని, రెవెన్యూ కింది స్థాయి సిబ్బంది సహకారంతోనే నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే సుమారు ఆరు ఎకరాల చెరువు స్థలం పరాధీనమైందని, ఇందులో నిర్మాణాలు చేపట్టారని రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు.

తాజాగా ఇదే తరహాలో ఇక్కడి స్థలాన్ని సుమారు రెండొందల గజాలు ఆక్రమించి నిర్మాణానికి సిద్ధపడటంతో ఈ ఆక్రమణపై తహశీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు రావడంతో చెరువు ఆక్రమణల సంగతి వెలుగులోకి వచ్చింది. చెరువు స్థలాన్ని ఆక్రమించి శ్లాబ్ వేసినా రెవెన్యూ అధికారుల్లో కదలిక లేదు. చెరువులను జీవీఎంసీకి బదలాయింపు జరిపామని, వీటి పరిరక్షణ బాధ్యత వారిదేనని రెవెన్యూ వారు అంటున్నారు. ఇక్కడ పట్టణ ప్రణాళిక అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా.. కాసుల కక్కుర్తితో టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు మేల్కొనకపోతే మిగిలివున్న రూ.కోట్ల విలువైన చెరువు స్థలం కూడా పరాధీనమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా చినముషిడివాడలోని చెరువును సర్వే చేయాలని రెవెన్యూ శాఖ యోచిస్తుండడం ఆక్రమణదారుల్లో గుబులు రేపుతోంది.

ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు

చినముషిడివాడ సర్వే నంబర్-70లో చెరువు స్థలం ఆక్రమణకు సంబంధించి సర్వే చేపడతాం. చెరువుల పరిరక్షణ బాధ్యతను జీవీఎంసీకి బదలాయించిన నేపథ్యంలో ఆక్రమణల విషయాన్ని వారికి లేఖ ద్వారా తెలియపరిచాం. అక్రమ నిర్మాణాలను తొలగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

-ఇంటి వెంకట అప్పారావు, పెందుర్తి తహశీల్దార్

ఇకపై గ్రీన్ పడితే రైట్..రైట్

... 5వ పేజీ తరువాయి

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను సింక్రనైజేషన్ చేయడం ద్వారా ఒక పరిమిత వేగంతో ప్రయాణించే వాహనం ఒకచోట గ్రీన్ సిగ్నల్ దాటి వెళితే తరువాత జంక్షన్‌లో కూడా గ్రీన్ సిగ్నల్ పడివుండేలా సాంకేతిక పరిజ్ఞానంతో సిగ్నల్ వ్యవస్థను మార్చే ప్రతిపాదనపై సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టిసారించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో నిధుల సర్దుబాటు గురించి రెండు నెలల కిందట సీపీ ప్రస్తావించగా.. ఆయన సుముఖత వ్యక్తం చేశారు. దీనిని కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తోపాటు ఎంపీ శ్రీభరత్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీ శ్రీభరత్ వీలైనంత వేగంగా దీనిపై చర్యలు ప్రారంభించాలని సీపీ, జీవీఎంసీ కమిషనర్‌లకు సూచించడంతో గతనెలలో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ ప్రాజెక్టు నిర్వహణలో అనుభవం కలిగిన సంస్థలతో సంప్రతింపులు జరిపారు. హైదరాబాద్, బెంగళూరు, లక్నో, ఢిల్లీ, ఇండోర్ వంటి నగరాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ ప్రాజెక్టులు నిర్వహిస్తున్న బృహస్పతి, అవిరోస్, అర్కడిస్, నయన్ సంస్థలు నగరంలో పైలట్ ప్రాజెక్టు కింద కొన్ని ప్రాంతాల్లో సర్వే చేపట్టాయి.

నాలుగు సిగ్నల్ పాయింట్ల వద్ద ట్రయల్ రన్ నిర్వహించగా విజయవంతమైంది. ఇందుకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇటీవల ఎంపీ శ్రీభరత్ సమక్షంలో కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్‌లకు ఆయా సంస్థలు వివరించాయి. ఎంపీ శ్రీభరత్ సంతృప్తి వ్యక్తం చేయడంతో తక్షణమే ఈ ప్రాజెక్టు నిర్వహణకు ఆర్ఎఫ్‌పీ పిలిచి, అక్టోబరు చివరి నాటికి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు దీనికి అనుగుణంగా చర్యలను వేగవంతం చేశారు. అంతా అనుకున్నట్టు జరిగితే నవంబరు నాటికి నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పోలీస్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఈవోఐలకు వ్యతిరేకంగా ప్లాంటు అడ్మిన్ భవనం వద్ద ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటులో ఈవోఐలను రద్దు చేయాలని, ప్లాంటు ప్రైవేటీకరణ ప్రక్రియ విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్లాంటు అడ్మిన్ భవనం వద్ద ధర్నా చేపట్టనున్నట్టు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ధర్నా చేపడతామన్నారు. ఉక్కు కార్మిక వర్గం, నిర్వాసితులు, వివిధ సంఘాల ప్రతినిధులు భారీగా హాజరై ఉక్కు యాజమాన్యానికి తమ నిరసన తెలపాలని పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

స్టీల్‌ప్లాంటు, పరిసర ప్రాంతాల్లో ధర్నాకు అనుమతులు లేవు

» సీఐ కేశవరావు ప్రకటన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి ధర్నాలు నిర్వహించేందుకు అనుమతులు లేవని స్టీల్‌ప్లాంట్ సీఐ ఎ.కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్లాంటు ప్రధాన పరిపాలన భవనం ముందుధర్నాకు నాయకులు పిలుపునిచ్చిన క్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఇతర నాయకులకు అనుమతి లేదని చెప్పటం జరిగిందని సీఐ తెలిపారు. ఒకవేళ ధర్నా చేపట్టాల్సి వస్తే జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేసుకోవచ్చని, కానీ స్టీల్‌ప్లాంట్ పరిసరాల్లో చేయరాదని సూచించారు. అనుమతి లేని చోట ధర్నాలు చేస్తే చట్ట రీత్యా తగు చర్యలకు శిక్షార్హులవుతారని తెలిపారు.

ఇన్ సర్వీస్ అభ్యర్థులకు 'టెట్' మినహాయింపు ఇవ్వాలి

పెదగంట్యాడ,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు ఒక ప్రకటనలో కోరారు. ఏదేళ్ల పైబడి సర్వీసులో ఉన్న ప్రతి ఉపాధ్యాయుడు టెట్ పరీక్షలో అర్హత సాధించాలని, లేకుంటే ఉపాధ్యాయుడుగా కొనసాగే అర్హత లేదని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో సంబంధిత ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో ఆందోళన మొదలైందని పేర్కొన్నారు. 1995 నుంచి ఇప్పటి వరకు వేర్వేరు డీఎస్సీల ద్వారా వేలమంది ఉపాధ్యాయులుగా నియామకమయ్యారని, వారికి టెట్ ఒక సమస్యగా మారిందని పేర్కొన్నారు. అందువల్ల ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

అంతర్జాతీయ విజిటర్ లీడర్ షిప్ ప్రోగ్రామ్‌కు ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ ఎంపిక



విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అమెరికా ప్రభుత్వం నిర్వహించే ఇంటర్నేషనల్ విజిటర్ లీడర్ షిప్ ప్రోగ్రామ్ (ఐవీఎల్‌పీ)కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ మేకా జేమ్స్ స్టీఫెన్ ఎంపికయ్యారు. ఈ నెల 27 నుంచి అక్టోబరు 18 వరకు అమెరికాలో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు. దేశం నుంచి ఎంపికైన ఏకైక వ్యక్తిగా స్టీఫెన్ నిలిచారు.

సినిమా గైడ్

- **ఓజీ** : మెలోడి, శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),
- **ఘాటీ** : గోకుల్, ముక్తాస్, (గాజువాక)
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండకాయలు 36, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 32, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 44, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250



ఎల్వీ నగర్‌లో శ్రీరాజేశ్వరీ దేవికి పిండివంటల నివేదన



ఉక్కుటౌన్‌షిప్ : త్రిశక్తి ఆలయంలో మహాచండి దేవిగా మహాదుర్గ



అగనంపూడి : పసుపు, కుంకమలతో చండీదేవి అలంకరణలో అమ్మవారు



అక్కిరెడ్డిపాలెం : తుంగ్లాంలో లక్ష గాజులతో అలంకరించిన దుర్గాదేవి అమ్మవారు

పాహి మాం దుర్గాభవానీ

ఆటోనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 70వ వార్డు డ్రైవర్సు కాలనీలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ఆదివారం రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి ప్రధాన అర్చకులు కొండూరి సోమేశ్వర శర్మ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు, భవానీలు కనక దుర్గమ్మకు సారె ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జిచట్టి గోపి, అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావు, వీబీఎల్ మూర్తి, శివగణేష్, కోటి, రూపాజ్యోతి, అధిక సం ఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎల్వీనగర్ శ్రీకనక దుర్గమ్మ ఆలయంలో ఆదివారం రాజేశ్వరీదేవిగా ఆరవిల్లి కృష్ణశర్మ పర్యవేక్షణలో అలంకరించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యం లో భక్తులు సారె ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధు లు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ఆది వారం సారె ఊరేగింపు చేపట్టారు. ఆదివారం కనకదుర్గమ్మ అమ్మవారి మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అన్నసమారాధన కార్యక్రమాలను వార్డు కార్పొరేటర్ బొండా జగన్ ప్రారంభించారు. కార్యక్రమం లో నాయకులు విజయరామరాజు, డీవీ అప్పారావు, రాజన్‌రాజు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 86వ వార్డు మాతృశ్రీనగర్‌లో దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి ఆధ్వర్యంలో కాశీఅన్నపూర్ణాదేవి అమ్మవారికి ప్రధాన అర్చకులు వ్యాఘ్రేశ్వరరావుశర్మ పర్యవేక్షణలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.జీవీఎంసీ 88వ వార్డుఎస్టీబీఎల్ ఎల్ఎస్ గార్డెన్స్‌లో పోలమాంబ అమ్మవారిని శ్రీరా జేశ్వరిగా అలంకరించిచంద్రమౌళీశర్మ పర్యవేక్షణలో పసుపు, కుంకుమతో అలంకరించి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలుని ర్వహించారు.

ఉక్కుటౌన్‌షిప్‌లో..

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : స్టీల్ ప్లాంటు టౌన్‌షిప్‌లోని త్రిశక్తి ఆలయంలోని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. మహాదుర్గ అమ్మవారిని మహచండీదేవిగా, శ్రీమహాలక్ష్మి అమ్మవారిని భద్రలక్ష్మిగా, శ్రీమహా సరస్వతి అమ్మవారిని భువనేశ్వరిదేవీగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించారు.

అగనంపూడిలో..

అగనంపూడి, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి పోస్టాఫీసు వద్ద గల దుర్గమాంబ ఆలయంలో శరన్నరాత్రుల మహోత్సవాల్లో భాగంగా ఆదివారం చండీదేవి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సం ఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. చీరలు సమర్పించి మొ క్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మెన్ చిత్తాగణేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి శనివాడ దుర్గాదేవి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పాల్గొని ప్రారంభించారు. అంతకుముందు ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు గల్లా హనిత, వెంకటరావు, సింగిగి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుంగ్లాం దుర్గాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో బాగంగా ఆదివారం అమ్మవారిని లక్ష గాజులతో భవానీ భక్తులు అలంకరించారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులతో పాటు భవానీ భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్రాఫిక్ నియంత్రణకు 'ట్రాఫిక్ సోల్జర్స్'

గాజువాక, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గాజువాక ట్రాఫిక్ సోల్జర్స్ అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్టు ట్రాఫిక్ సీఐ షేక్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ పోలీస్ అధికారులు, ఎక్స్ సర్వీసుమన్, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘ సభ్యులు, ట్రాఫిక్ నియంత్రణకు ఆసక్తి గల పౌరులతో ఈ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ ద్వారా పబ్లిక్ సర్వీసు చేద్దామనే కోరిక ఉండి, పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి పని చేద్దామని ఆశించే వారు చేరవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంపై ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను ఫోన్ : 94407 96018 (గాజువాక ట్రాఫిక్ సీఐ)లో సంప్రదించి కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సీఐ కోరారు.

ఎల్వీ నగర్‌లో దంత, నేత్ర వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం నేపథ్యంలో అక్టోబర్ 2 వరకూ నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ పక్షోత్సవాల నిర్వహణలో భాగంగా మండల అధ్యక్షురాలు దేనంకొండ పావని ఆధ్వర్యంలో కేర్ ఆస్పత్రి, స్ఫూర్తి హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి, దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి రక్తం, షుగర్, కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, బీజేపీ స్థానిక నాయకులు రోహిణి వత్సవాయి, బాటా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్ సిటీ డిపోను యథావిధిగా కొనసాగించాలి'



మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌టీసీ ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్ సిటీ డిపోను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఆయన భీమవరంలోని క్యాంప్ కార్యాలయంలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్‌సిటీకి సంబంధించిన లీజు గడువు ముగియడంతో స్థలాన్ని ఖాళీ చేయాలని ప్లాంట్ యాజమాన్యం ఆర్టీసీపై ఒత్తిడి తెస్తుందని మంత్రికి వివరించారు. స్టీల్‌సిటీ అక్కడే కొనసాగాల్సిన ఆవశ్యకతను తెలిపారు. దీనికి స్పందించిన మంత్రి స్థలం లీజు గడువు పొడిగించి డిపో అక్కడే కొనసాగేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి ఎస్. కుమార్, పశ్చిమగోదావరి జిల్లా శాఖ కార్యదర్శి వైవీ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డు సిద్ధార్థ నగర్ వద్ద గల 12 ఎంఎల్డీ మంచి నీటి శుద్ధి కర్మాగారంలో మోటారు మరమ్మతులు, సుందరయ్య కాలనీలో ఉన్న 10 ఎంజీడీ పంప్ హౌస్ వద్ద వాటర్ పైప్‌లైన్ మరమ్మత్తుల నేపథ్యంలో 70, 71, 72, 73, 74, 76, 64, 65, 86, 87ల వార్డు పరిధిలో సోమవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఆయా వార్డుల ప్రజలు సహకరించాలని, తాగునీరు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని నీటి విభాగం ఏఈ కేదారినాథ్ ఒకప్రకటనలో తెలిపారు.

అమరేశ్వరుని సన్నిధిలో పల్లా శ్రీనివాసరావు

అమరావతి, సెప్టెంబరు 28: పంచారామ తీర్థాలలో ప్రథమ ఆరామంగా పేరుగాంచిన అమరావతిలోని అమరేశ్వరస్వామి ఆల యాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా సం దర్శిం చారు. ఆలయ అధికారులు, అర్చకులు శ్రీనివాసరావు దంపతులకు స్వాగతం పలికిపూజలు నిర్వహించారు. వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో రేఖతో పాటు అర్చకులు పాల్గొన్నారు.



పల్లా దంపతులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ రేఖ

భగత్‌సింగ్‌కు నివాళి

అగనంపూడి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి సత్రం జంక్షన్ లో గల మహాత్మా గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆది వారం స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 119వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 85వ వార్డు జనసేన అధ్యక్షుడు గవర సోమశేఖర్ పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చిత్తా రామారావు, కోసూరి తాతారావు, ఏవీ కృష్ణ, సత్యసాయి రఘునాథ్, చిన్నా, సునీల్, జానకీదేవి, శోభారాణి, శిరీష, మంగమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, పద్మ, వసంత పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హాకథాన్

అగనంపూడి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హాకథాన్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. కో-ఫౌండర్ టెరా వాట్ పవర్ ల్యాబ్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధి రణవీర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జె.సుధాకర్, మోహన్ మహంతి, కల్యాణి, సంపత్ దక్షిణమూర్తి, శాలిని,అధ్యాపకులు పాల్గొన్నారు.



మహా కామేశ్వరీ ఆలయంలో లక్ష్మీ దేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తదితరులు



మహాలక్ష్మి అలంకరణలో శారదామాత



నాగేంద్రకాలనీలో దుర్గాదేవి పూజల్లో పాల్గొన్న పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు తదితరులు

మహాలక్ష్మీ పాహిమాం...

పెందుర్తి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలోని శారదాపీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వీయ పర్యవేక్షణలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పీఠం అధిష్ఠాన దేవత శారదా రాజశ్యామల అమ్మవారిని ఆదివారం మహాలక్ష్మి రూపంలో అలంకరించారు. ఉత్తరాంధ్ర శబరిమలై అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో గల దుర్గాదేవి ఆలయంలో దుర్గమ్మను మహాలక్ష్మిగా అలంకరించారు. వెంకటాద్రి శిఖరం దిగువన గల మహాకామేశ్వరీ ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ధర్మకర్త యజ్ఞేశ్వర చైనులు బండారుకు సంప్రదాయ పద్ధతిలో స్వాగతించారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు, యువత అధ్యక్షుడు శ్రీనుయాదవ్ పాల్గొన్నారు. మండలంలో గల ఎస్ఆర్‌పురంలోని కనకదుర్గ ఆలయంలో ధర్మకర్త కాయితి ఎర్రిబాబు దుర్గాదేవి అమ్మవారిని మంగళగౌరీ రూపిణిగా అలంకరించారు. పెందుర్తి సాధూమఠం సమీపంలో దివంగత పీఠాధిపతి యద్దనపూడి అయ్యన్నపంతులు నెలకొల్పిన మహాకామేశ్వరీ పీఠంలో మహాలక్ష్మిగా అలంకరించారు.

దుర్గాదేవికి ఘనంగా పూజలు



పూజలలో పాల్గొన్న సీఐ అప్పారావు తదితరులు

మల్కాపురం: గ్రేటర్ విశాఖ 61వ వార్డు యాదవ వీధిలో అల్లరి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవీ నవరాత్రి ఉత్సవాలలో రాష్ట్ర నగరల కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జి సోమేష్, మల్కాపురం పోలీసు స్టేషన్ సీఐ గొలగాని అప్పారావులు పాల్గొని దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సీఐ అప్పారావు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవం నిర్వహించాలని, శాంతిభద్రతలకు భంగం కలగకుండా చూడాలని కమిటీని కోరారు. అనంతరం శాలువతో సీఐ అప్పారావు, నగర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేష్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అల్లరి యూత్ ప్రతినిధులు బట్ట చిన్న, నమ్మి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

గోపాలపట్నం: అమ్మవారి ఆలయాలతో పాటు పలు ప్రాంతాల్లో ఉత్సవ మండపాలను ఏర్పాటు చేసి ఘనంగా నవరాత్రి వేడుకల్ని నిర్వహిస్తున్నారు. స్థానిక నాగేంద్రకాలనీలో అమ్మవారిని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మండపం వద్ద జరిగిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, పీఏసీఎస్ చైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అయితంశెట్టి కోటేశ్వరరావు, స్థానిక నేతలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

వేపగుంట, ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట కృష్ణానగర్ దుర్గా మల్లేశ్వరాలయంలో ఆదివారం దుర్గాదేవిని మహాచండీగా అలంకరించారు. ఉదయం సామూహిక కుంకుమ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాయుడుతోట రవినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బాలా త్రిపురేశ్వరి పీఠం ఆధ్వర్యంలో దివాకరుణ శ్రీరామ చంద్ర శేఖర్‌శర్మ పర్యవేక్షణలో మహా చండీ హోమం నిర్వహిస్తున్నారు. ఇక్కడి పూజలను కుర్తాలమ్ పీఠం నుంచి వచ్చిన సిద్ధేంద్రనంద స్వామి శిష్యులు మిన్నకంటి వెంకట నాగేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు. వేపగుంట బీసీకాలనీలో దుర్గా మండపాన్ని పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండిబాబ్జి దర్శించుకొని అనంతరం అన్నసంతర్పణను ప్రారంభించారు. వేపగుంట రామాలయంలో అన్నదానం కార్యక్రమాన్ని కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ప్రారంభించారు.



రవినగర్‌లో బాలత్రిపురేశ్వరి పీఠంలో...

నిరుద్యోగ సమస్యపై పోరాడతాం : డీవైఎఫ్‌ఐ కార్యదర్శి రామన్న

మల్కాపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో నిరుద్యోగం పై పోరాడనున్నట్లు డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పేర్కొన్నారు. జిల్లా 16వ మహాసభ ఆదివారం శ్రీహరిపురంలో జరిగిన సందర్భంగా మల్కాపురం నుంచి ర్యాలీ నిర్వహించారు. తొలుత డీవైఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీహరిపురంలో జరిగిన సభలో రామన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాల కోసం జాబ్‌క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మల్కాపురం ప్రాంతంలో ఉన్న పరిశ్రమలలో యువతకు ఉపాధి కల్పించేలా యాజమాన్యాలు తమ వంతు కృషి చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు యూఎస్ఎన్ రాజు మాట్లాడుతూ మతోన్మాద చర్యలను ఆర్ఎస్ఎస్ విడనాడాలన్నారు. కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ఎన్నికల హామీ గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పనిదినాన్ని 13 గంటలకు మార్చడాన్ని తప్పుపట్టారు. ఈ సభలో ఎస్.వాసు, శ్రావణ్ కుమార్, శైలజ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ కార్యదర్శి రామన్న

నూతన కార్యవర్గం

విశాఖ జిల్లా డీవైఎఫ్ఐ అధ్యక్షుడిగా యూఎస్ఎన్‌రాజు, కార్యదర్శిగా కె.మహేష్, ఉపాధ్యక్షులుగా శ్రావణ్, ఎస్.వాసు, గణేష్, సహాయ కార్యదర్శులుగా బూడి శ్రీను, రవి, ప్రభు, రాము, శ్యాము, అప్పలరాజు, కమిటీ సభ్యులుగా సమీన్, సుభాన్, శరత్, ప్రసాద్, హరిత, పోతయ్య, అప్పలరాజు ఎన్నికయ్యారు.

ధనలక్ష్మి అలంకరణలో అలివేలు మంగాదేవి



పెందుర్తి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చినముషిడివాడ సప్తగిరినగర్‌లో గల అలివేలు మంగాదేవిని ఆదివారం ధనలక్ష్మి రూపంలో అలంకరించారు. మూలవిరాట్టు విగ్రహం ఆపాదమస్తకం రూ.10 లక్షల విలువైన కరెన్సీ నోట్లు, డాలర్లు, నాణేలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

అభాగ్యులకు అండగా డిజిటల్ బుక్: అదీప్‌రాజ్



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

పెందుర్తి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై వైసీపీ గళం ఎత్తుతుందని, కూటమి అరాచకాలకు మూల్యం చెల్లించక తప్పదని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. రాంపురంలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం 'వైసీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్'ను అనకాపల్లి జిల్లా పార్లమెంటరీ సమన్వయకర్త బొడ్డాడ ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు దంతులూరి దిలీప్‌లతో సంయుక్తంగా ఆవిష్కరించారు. అదీప్‌రాజ్ మాట్లాడుతూ కూటమి ఏలుబడిలో అన్యాయానికి గురైన కార్యకర్తలు క్యూఆర్ కోడ్, ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కార్యకర్తలకు అండగా నిలిచి ప్రజల గొంతు వినిపించేందుకే వైసీపీ డిజిటల్ బుక్ వ్యవస్థకు శ్రీకారం చుట్టిందన్నారు. వైసీపీ సమన్వయకర్త బొడ్డాడ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి పాలనకు ప్రజలు విసిగిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో పైల శ్రీనివాసరావు, గండి రవికుమార్, బయిలపూడి భగవాన్ జయరామ్, ఉప్పిలి కనకరాజు, మధుపాడ అంజి, కొరాన రాము. ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు వనసేన కృషి అభినందనీయం'



వనసేన బృందంతో జడ్జి ప్రదీప్‌కుమార్

మల్కాపురం సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మూడు వారాలుగా వనసేన బృందం యారాడ సాగర గిరి కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా జ్యుడీషియల్ న్యాయమూర్తి ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. సాగర గిరి కనకదుర్గ అమ్మవారిని ఆదివారం ఆయన దర్శనం చేసుకున్న సందర్భంగా వనసేన బృందం సభ్యులను ప్రోత్సహిస్తూ మాట్లాడారు. యారాడ బీచ్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు చైతన్య పరచడం గొప్ప విషయమన్నారు. యువత మరింత ముందుకొచ్చి ప్రకృతిని కాపాడడంలో పాలుపంచుకోవాలని కోరారు. 58వ వార్డు జనసేన అధ్యక్షుడు ముప్పిన ధర్మేంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

జేడీ ఫౌండేషన్ కృషి అభినందనీయం



నారసంచులు పంపిణీ చేస్తున్న బెహరా తదితరులు

గోపాలపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనసేన నేత బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. స్థానిక రైతు బజారులో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన నార సంచుల పంపిణీ కార్యక్రమాన్ని బెహరా ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు జేడీ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎస్టేట్ అధికారి ప్రసాద్, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.